జేఈఈ మెయిన్‌కు 9మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : జేఈఈ మెయిన్ ఆన్‌లైన్ పరీక్షల్లో భాగంగా శుక్రవారం స్థానిక సిద్ధార్థ క్వెస్ట్ పరీక్ష కేంద్రానికి ఉదయం, మధ్యాహ్నం సెషన్లకు 180 మంది విద్యార్థులు చొప్పున కేటాయించగా 178, 176 మంది హాజరయ్యారు. సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రానికి ఉదయం 114 మందికి 112, మధ్యాహ్నం 112 మందికి 111 మంది హాజరయ్యారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు నమోదు కాలేదు.

భీమవరం కాదు.. నరసాపురానికి

వందే భారత్ ముంగిట కొత్త ప్రతిపాదన

- ప్రస్తుతం విజయవాడ-చెన్నై మధ్య రాకపోకలు
- వాటర్ ఫిల్లింగ్ సమస్యతో పొడిగింపునకు కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ విజ్ఞప్తి
- సదరన్ రైల్వే ఓకే చెబితే వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి రాకపోకలు



నరసాపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి):వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును జిల్లాకు తీసుకొచ్చేందుకు నేతలు, అధికారులు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతం చెన్నై-విజయవాడ మధ్య నడుస్తున్న ఈ రైలును ఏడాది క్రితం భీమవరం వరకు పొడిగించాలని ప్రతిపాదించారు. అయితే ఈ రైలు నిర్వహణకు ఇక్కడ సిబ్బంది, వాటర్ ఫిల్లింగ్‌కు అవసరమైన పైప్‌లైన్‌లు లేకపోవడంతో పెండింగ్ పడింది. ఎలాగైనా సదరన్ రైల్వేను ఒప్పించి నరసాపురం వరకు పొడిగించేందుకు కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ ప్రయత్నిస్తున్నారు. ఏడాదిన్నర క్రితం చెన్నై-విజయవాడ మధ్య 20677 నెంబర్‌తో వందే భారత్‌ను నడుపుతున్నారు. ఇది చెన్నైలో ఉదయం 5.30 గంటలకు బయలుదేరి 11.30కి విజయవాడ చేరుతుంది. తిరిగి 20678 నెంబర్‌తో మధ్యాహ్నం 3.20 గంటలకు బయలుదేరి రాత్రి 9.30కి చెన్నై వెళుతుంది. ఉదయం చెన్నై నుంచి వచ్చి విజయవాడ స్టేషన్‌లో నాలుగు గంటలపా టు ఈ రైలు నిలిచిపోవడం వల్ల ప్లాట్‌ఫారం సమస్య తలెత్తుతోంది. విజయవాడ స్టేషన్‌లో రైళ్ల రాకపోకలు అధికం కావడంతో ఎక్కువ సేపు వందే భారత్ నిలిచిపోవడం వల్ల ప్లాట్‌ఫారాలు ఖాళీలేక కొన్ని సమయాల్లో కొన్ని రైళ్లను అవుటర్‌లో రెడ్‌సిగ్నల్ ఇచ్చేస్తున్నారు. దీనివల్ల రైళ్లు ఆలస్యానికి కారణమవుతున్నాయి. దీనిని గుర్తించిన రైల్వే ఈ ఎక్స్‌ప్రెస్‌ను పొడిగించాలని నిర్ణయించింది. ఏ స్టేషన్ వరకు పొడిగిస్తే ప్రయాణికుల డిమాండ్ ఉం టుందన్న దానిపై తర్జనభర్జనలు చేశారు. చివరికి భీమవరం స్టేషన్‌ను ఓకే చేశారు. అప్పటికే కొత్తగా డబ్లింగ్ లైన్ వేయడం వల్ల ట్రాక్ సామర్థ్యం సరిపోవడం తో అంతా ఒకే అని భావించారు. అయితే భీమ వరం రన్నింగ్ స్టేషన్, ఇక్కడ రైళ్ల నిర్వహణకు ప్రత్యేక సిబ్బంది ఉండరు. బోగీలకు నీరునింపే సదుపాయం ఈ స్టేషన్‌లో లేదు. వీటి ఏర్పాటు ఖర్చుతో కూడిన పని, వీటిని అధ్యయనం చేసి ప్రస్తుతం పెండింగ్‌లో పెట్టారు.

మంత్రి జోక్యంతో స్పీడ్

డబ్లింగ్ పనులు పూర్తయిన తరువాత జిల్లా మీదుగా రైళ్ల సంఖ్య పెరగలేదన్న భావన ప్రయాణీకుల్లో ఉంది. అమరావతి ప్రతి శుక్రవారం బెంగళూరు స్పెషల్ మినహా కొత్త రైళ్లు ఏవీ రెండేళ్లలో జిల్లా పట్టాలెక్కలేదు. అన్నీ మచిలీపట్నం, కాకినాడ వైపే తరలిపోతున్నాయి. చివరికి వందే భారత్ దారి మళ్లుతుందని గుర్తించిన కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ కొత్త ప్రతిపాదనను తెర మీదకు తీసుకొచ్చారు. భీమవరంలో సాధ్యం కాకపోతే నరసాపురం వరకు పొడిగించాలని రైల్వే మంత్రిని కోరారు. కేవలం అరగంట వ్యవధిలో ఈ రైలు భీమవరం నుంచి నరసాపురం చేరుకుంటుంది. జిల్లాలో నరసాపురం స్టేషన్‌లో రెండు పిట్‌లైన్లు ఉన్నాయి. వాటర్ ఫిల్లింగ్ సదుపాయం ట్రాక్‌లపై ఉంది. వీటితో పాటు ఎన్నో ఏళ్లుగా నరసాపురం నుంచి చెన్నైకు రైలు నడపాలన్న ప్రతిపాదన ఉంది. ఇప్పుడు వందే భారత్‌ను పొడిగిస్తే ఈ హామీ కూడా నెరవేర్చినట్లు అవుతుందని రైల్వే మంత్రికి, అధికారులకు వివరించారు. ఇదే ప్రతిపాదనను సదరన్ రైల్వేకు పంపారు. తాజా ప్రతిపాదనకు సదరన్ రైల్వే పచ్చ జెండా ఊపితే వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి జిల్లావాసులకు వందే భారత్ రైలులో ప్రయాణించే ఛాన్స్ దక్కుతుంది.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి, ఎస్పీ అస్మి

సీఎం చంద్రబాబు 1న తణుకు రాక !

- లక్ష గృహ ప్రవేశాలకు తణుకులో శ్రీకారం చుట్టే అవకాశం..
- కలెక్టర్, ఎస్పీ ఏర్పాట్ల పరిశీలన
- పర్యటన అధికారికంగా ఖరారు కావాల్సి వుంది

తణుకు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఫిబ్రవరి 1న పశ్చిమగోదావరి జిల్లా తణుకులో పర్యటించే అవకాశం వుంది. రాష్ట్రవ్యాప్తంగా లక్ష పీఎంఏవై - ఎన్టీఆర్ నగర్ లలో గృహ ప్రవేశాల కార్యక్రమానికి తణుకు నుంచే శ్రీకారం చుట్టే అవకాశాలు ఉన్నట్టు భావిస్తున్నారు. అలాగే పింఛన్‌దారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు సీఎం చేతుల మీదుగా అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే షెడ్యూలు అధికారికంగా ఖరారు కావాల్సి వుంది. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం తణుకు, తేతలి, మండపాక పీఎంఏవై-ఎన్టీఆర్ నగర్‌లలో హౌసింగ్ లే అవుట్లను, తణుకు ఎస్ఎన్‌వీఎం పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలోని హెలీపాడ్ ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. అధికారులకు పలు సూచనలు చేశారు. వీరి వెంట ఏఎస్పీ వి.భీమారావు, ఆర్డీవో కతీబ్ కౌశల్‌బానో, హౌసింగ్ పీడీ వై.హరనాథ్, తహశీల్దార్ దండు అశోక్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.



కొల్లేరు ఏం చేద్దాం ?

కైకలూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి):కొల్లేరు ఆక్రమణలపై సుప్రీంకోర్టులో వరుస ఫిర్యాదులతో కొల్లేరు ప్రజల్లో ఆందోళన మొదలైంది. అరకొర చేపల చెరువు గట్లలో ఉన్న నీటిలో చేపలను పట్టుకొని జీవనం సాగిస్తున్న వారికి ఇది మింగుడుపడని సమస్యగా మారింది. మరికొన్నిచోట్ల వేలాది ఎకరాలు చెరువులుగా మార్చి, దాని నుంచి వచ్చే ఆదాయంతో ఆయా గ్రామాల్లో ప్రజలు పంచుకొని జీవనాధారం పొందుతున్నారు. 2006లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కొల్లేరు ఆపరేషన్ పేరుతో వేలాది ఎకరాల చేపల చెరువులను ధ్వంసం చేశారు. అప్పటి నుంచి ఆయా కొల్లేరు గ్రామాల్లోని ప్రజలకు జీవనోపాధి లేక పొట్ట చేతపట్టుకుని పొరుగు రాష్ట్రాలకు వలసలు వెళ్లారు. ఇతర ప్రాంతాలకు వెళ్లలేని వారు ఆయా గ్రామాల్లోని సంప్రదాయ వేటను నమ్ముకొని జీవనం సాగిస్తున్న తరుణంలో మరొకసారి కొల్లేరు సమస్య తెరమీదకు రావడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. మరోసారి ఉన్న చెరువులను ధ్వంసం చేస్తే ఇక ఎప్పటికీ తమకు జీవనోపాధి లభించదని ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు ఆదేశాలతో ఇప్పటికే అటవీశాఖ అధికారులకు చేపల చెరువులకు గండ్లు పెట్టారు. దీనిపైన మార్చి చివరి నాటికి కొల్లేరు కాంటూరు సరిహద్దులను నిర్ధారించి పూర్తిస్థాయిలో నివేదికలు అందించాలని సుప్రీంకోర్టు కోరడంతో ఈ సమస్య మొదటికి వచ్చింది. దీంతో కొల్లేరు ప్రాంతంలోని నాయకులు స్థానిక ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్నారు. ప్రజల జీవనోపాధికి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందో లేక ఉన్న చెరువులను ధ్వంసం చేస్తారో తెలియని అయోమయ పరిస్థితుల్లో కొల్లేరు ప్రజలు కొట్టిమిట్టాడుతున్నారు. వీటి నుంచి తమను తాము కాపాడుకునే ప్రయత్నంలో భాగంగా కొల్లేరు పరిరక్షణ పేరుతో భారీ బహిరంగసభకు తెరతీశారు. ఈ మేరకు శనివారం మధ్యాహ్నం నాలుగు గంటలకు కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో కొల్లేరు పరిరక్షణ సమావేశం జరపనున్నారు.

నేడు పరిరక్షణ సమావేశం
హాజరు కానున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

సమావేశానికి ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు డాక్టర్ కామినేని శ్రీనివాస్, చింతమనేని ప్రభాకర్, బడేటి చంటి, పత్సమట్ల ధర్మరాజు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, కొల్లేరు ప్రముఖ నాయకులు పాల్గొంటారని రాష్ట్ర టీడీపీ వడ్డీ సాధికారిక సమితీ కన్వీనర్ బలే ఏసురాజు తెలిపారు. కొల్లేరు సమస్య పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ఈ సమావేశానికి కొల్లేరు లంక గ్రామాల్లోని ప్రజలంతా పెద్దఎత్తున తరలిరావాలని ఆయన కోరారు.



మాధవరావు (103)

ఓటు ప్రాణ సమానం.. అత్యంత పవిత్రం

వృద్ధాప్యం ముంచుకొచ్చిన నడవలేని స్థితిలో ఉన్న ఓ సీనియర్ ఓటరు ఇప్పటి వరకు జరిగిన అన్ని ఎన్నికల్లో క్రమం తప్పకుండా ఓటు వేసి ఓటు ప్రాధాన్యతకు నిదర్శనంగా నిలిచారు. వయో వృద్ధుడైన ఆ ఓటరు ఇప్పటికీ ఓటు నా ప్రాణ సమానం అనడం గమనార్హం. ముదినేపల్లి మండలం చేవూరుకు చెందిన శతాధిక వృద్ధుడు వల్లభనేని మాధవరావు (103) 1922లో జన్మించారు. ఆయన స్వాతంత్రానంతరం రాష్ట్రంలో లోక్‌సభకు, అసెంబ్లీకి జరిగిన సాధారణ, మధ్యంతర ఎన్నికలతోపాటు స్థానిక సంస్థలు, సహకార సంస్థల ఎన్నికల్లోను క్రమం తప్పకుండా ఓటేశారు. ఐదేళ్లుగా ఇంటి వద్ద మంచానికే పరిమితమైనా గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లోను ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆ సమయంలో మాధవరావు ఒక మాట అన్నారు. 'ఓటు నా ప్రాణంతో సమానం - ఓటు వేయలేమోనన్న బాధతో ఉండగా ఎన్నికల కమిషన్ ఇంటి నుంచే ఓటు వినియోగించుకునే అవకాశం కల్పించడం ఎంతో ఆనందం కలిగించింది. ఇది నాలాంటి వాళ్ల కోసమేనేమో' అంటూ ఆనందం కనబర్చారు. ఆయన గతంలో చేవూరు సర్పంచ్‌గా, పీఏసీఎస్ అధ్యక్షుడిగా, పాల ఉత్పత్తిదారుల సంఘ అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఓటును పవిత్రంగా భావించాలని ఆయన అందరికీ చెబుతుంటారు.

\- ముదినేపల్లి

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

ఉత్తమ ఎన్నికల విధులకు.. పురస్కారం

జిల్లా నుంచి బెస్ట్ ఎలక్ట్రోరల్ అవార్డుకు తహసీల్దార్, ఇద్దరు బీఎల్‌వోలు ఎంపిక



చెల్లన్న · నాగూర్‌వలీ · భవాని

ఏలూరు అర్బన్/కొయ్యలగూడెం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఓటర్ల జాబితా నవీక రణ విధుల్లో అత్యుత్తమ సేవలందించిన జిల్లాకు చెందిన ఒక తహసీ ల్దార్‌తో పాటు ఇద్దరు బీఎల్‌వో (బూత్ లెవెల్ ఆఫీసర్)లు బెస్ట్ ఎలక్ట్రోరల్ అవార్డులకు ఎంపికయ్యారు. ఈ మేరకు అధికారిక సమాచారాన్ని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం విడుదల చేసింది. ఈ మేరకు కొయ్యలగూడెం తహసీల్దార్ కె.చెల్లన్న బెస్ట్ ఎలక్ట్రోరల్ అవార్డుకు ఎంపికయ్యారు. అవార్డు తన బాధ్యతలను మరింత పెంచిందన్నారు. కాగా ఏలూరు కార్పొరేషన్ పరిధిలోని ఎమ్మార్సీ కాలనీ-2 సచివాలయంలో వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్ర టరీగా పని చేస్తున్న ఎస్కే.నాగూర్‌వలి (కామవరపుకోట) నగరంలోని కట్టా సుబ్బారావుతోట పోలింగ్ స్టేషన్ నెంబరు 57లో బీఎల్‌వోగా విధులు నిర్వర్తిస్తున్నారు. పోలవరం అసెంబ్లీ నియోజక వర్గం పరిధిలో గెడ్డపల్లి పంచాయతీ పోలింగ్ స్టేషన్ నెంబరు 245లో బీఎల్‌వోగా ఎస్.భవాని విధులు నిర్వర్తిస్తున్నారు. ఎన్నికల విధుల నిర్వ హణలో అత్యుత్తమ సేవలందించినందు కు ఈ ముగ్గురికి జిల్లాలో పురస్కారాలు లభించాయి. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించే కార్యక్రమంలో అవార్డులను అందజేయనున్నారు.

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవానికి సర్వం సిద్ధం

ఏలూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఓటర్లలో చైతన్యం నింపేందుకు శనివారం పోలింగ్ బూత్‌లు, మండల, జిల్లా స్థాయిలో ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహణకు అధికార యంత్రాంగం సన్నాహాలు పూర్తి చేసింది. ఏలూరులోని ఇండోర్ స్టేడియం నుంచి ఫైర్‌స్టేషన్, డీఈవో కార్యాలయం మీదుగా ఇండోర్ స్టేడియం వరకు ఇంటర్, టెన్త్ విద్యార్థులతో 2కే రన్, మానహారం నిర్వహించనున్నారు. ఓటర్లను చైతన్యం చేస్తూ ముద్రించిన టీ షర్టులను ప్రతీ నియోజక వర్గంలో యువత ధరించి ప్రదర్శనల్లో పాల్గొననున్నారు. ఏటా జనవరి 25న జాతీయ ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం జరుగుతుంది. కలెక్టరేట్‌లో జాతీయ ఓటర్ల దినోత్సవ సభను ఉదయం 10 గంటలకు కలెక్టర్ వెట్రిసెల్వి ఆధ్వర్యంలో నిర్వహించనున్నా రు. వివిధ కేటగిరుల్లో విజేతలకు సర్టిఫికెట్ల ప్రదానంతో పాటు, ఓటర్ల చైతన్యవంతులను చేసిన, సీనియర్ సిటిజన్లను సత్కరిస్తారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని అధికారులు విజయవంతం చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఒక ప్రకటనలో కోరారు. కాగా జిల్లాలో సవరించిన ఓటర్ల ముసాయిదా జాబితాను ఈనెల ఆరో తేదీన ప్రకటించారు. ఇందులో మొత్తం ఓటర్లు 16,38,436 కాగా పురుష ఓటర్లు 7,99,781 మంది, మహిళా ఓటర్లు 8,38,531 మంది ఉన్నారు.

ద్వారకా తిరుమలలో రోడ్డును కమ్మేసిన మంచు



మంచు దుప్పటి కప్పేసింది!

ఏలూరుసిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జనవరి నెలాఖరులోను చలితీవ్రత ఇంకా పెరుగుతూనే ఉంది. ఇప్పటికీ జిల్లాలో రాత్రి ఉష్ణోగ్రతలు 16 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు పడిపోయాయి. రెండు రోజులుగా జిల్లాలో మంచు తీవ్రత కొనసాగుతున్నప్పటికీ శుక్రవారం తెల్లవారు ఝామున మంచు తీవ్రతతో దారులు కనిపించని పరిస్థితి. కశ్మీర్ తరహాలో పొగమంచు కమ్మేసింది. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులపై ఈ మంచు కారణంగా వాహన దారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మామిడి తోటలకు, ఆక్వా చెరువులపై మంచు ప్రభావం ఉంటుదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా ఏజెన్సీ ప్రాంతంలో మంచు తీవ్రత సాధారణంగా ఉండడం విశేషం.

జిల్లాలో పగటి/రాత్రి ఉష్ణోగ్రతల వివరాలు (సెంటీగ్రేడ్‌లో)	
జనవరి 19	32/17
జనవరి 20	33/16
జనవరి 21	36/16
జనవరి 22	36/17
జనవరి 23	35/16
జనవరి 24	36/16



లాటరీ ద్వారా మద్యం షాపులను కేటాయిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

కల్లుగీత కార్మికులకు మద్యం షాపుల కేటాయింపు

- లాటరీ ద్వారా ప్రకటించిన కలెక్టర్ వెట్రిసెల్వి
- నేడు గెజిట్ నోటిఫికేషన్

ఏలూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో కల్లుగీత కార్మికుల్లోని ఉప కులాలకు కేటాయించిన 14 షాపులకు కలెక్టర్ వెట్రిసెల్వి శుక్రవారం లాటరీ తీశారు. గౌడకు 2, గౌడ్‌కు 4, శెట్టిబలిజలకు 8 షాపులను ఆయా కులాల జనాభా ప్రాతిపదికన షాపులను కేటాయించాల్సి ఉండగా లాటరీ ద్వారా సామాజిక వర్గాలకు కేటాయింపును కలెక్టరేట్‌లో ఈ ప్రక్రియ చేపట్టారు. గౌడ్ సామాజిక వర్గానికి నూజీవీడు మునిసిపాలిటీ పరిధిలోని ఒక షాపు, చింతలపూడి రూరల్ ప్రాంతంలో ఒక షాపు, గౌడకు ఏలూరు కార్పొరేషన్, టి.నరసాపురం, దెందులూరు, జంగారెడ్డిగూడెం రూరల్‌లో ఒక్కొక్కటి చొప్పున 4, శెట్టిబలిజకు జంగారెడ్డిగూడెం మునిసిపాలిటీ, చింతలపూడి, చాట్రాయి, ముసునూరు, మండవల్లి, నిడమర్రు, ఆగిరిపల్లి, కొయ్యలగూడెం మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున 8 షాపులను భర్తీ చేస్తారు. ఈ నెల 25న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తారు. 27 నుంచి దరఖాస్తులను స్వీకరిస్తారు. ఆన్‌లైన్, హైబ్రిడ్ విధానాలు ద్వారా రూ2 లక్షల దరఖాస్తు రుసుం చెల్లించి దరఖాస్తును చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తులకు ఫిబ్రవరి 5 సాయంత్రం 5 గంటల వరకు గడువు ఇచ్చారు. ఫిబ్రవరి 6న దరఖాస్తులను పరిశీలన, ఏడున ఉదయం 10 గంటలకు లాటరీ పద్ధతిలో దరఖాస్తుల ఎంపిక ప్రక్రియను చేపడతారు. ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీలత, ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య, అసిస్టెంట్ సూపరింటెండెంట్ పాండురంగారావు, సీఐ జీఎస్ కృష్ణధనరాజ్, కల్లుగీత సామాజికవర్గంలోని ప్రతినిధులు పాల్గొన్నారు.



పిట్టలోళ్ల గుడిసెలు దగ్ధం

పది మందికి గాయాలు.. ఆరుగురి పరిస్థితి విషమం

- భైరవపట్నం సమీపంలో ప్రత్తిపాడు స్టేజీ వద్ద ఘటన 7

పారిశుధ్య కార్మికుల సమ్మెబాట..

అధికారుల హామీ- తాత్కాలికంగా విరమణ

ఏలూరు క్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలు, ఈపీఎఫ్ ఈనెల 29న చెల్లిస్తామని కాంట్రాక్టర్ అధికారుల ముందు అంగీకరించడంతో అధికారులు ఇచ్చిన హామీతో పారిశుధ్య కార్మికులు తాము చేస్తున్న నిరవధిక సమ్మెను విరమించారు. ఏపీ మెడికల్, కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ సంఘ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్య క్షుడు కె.కృష్ణమాచార్యులు, ప్రధాన కార్యదర్శి పి.దత్తాత్రేయ (దత్తు)ల ఆధ్వర్యంలో ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో శుక్రవారం పారిశుధ్య కార్మికులు విధులను బహిష్కరించి ఆస్పత్రి వద్ద ధర్నా చేపట్టారు. జిల్లా ఆస్పత్రి సేవల సమన్వయాధికారి డాక్టర్ పాల్ సతీష్ కుమార్ కాంట్రాక్టర్‌తో మాట్లాడగా ఈనెల 29న జీతాలు, ఈపీఎఫ్ పారిశుధ్య కార్మికులకు జమ చేస్తామని తెలిపారు. దీంతో అధికారులు కార్మికులకు హామీ ఇవ్వడంతో సమ్మెను తాత్కాలికంగా విరమించినట్టు యూనియన్ నాయకులు వెల్లడించారు.



ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

బాలికల భద్రతకు భరోసా : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : బాలికల సంరక్షణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా బేటీ బచావో- బేటీ పడావో కార్యక్రమాల ద్వారా పలుచర్యలను తీసుకుంటున్నట్టు కలెక్టర్ వెట్రిసెల్వి వెల్లడించారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ఆడిటోరియంలో జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ లింగనిర్ధాణ పరీక్షలపై నిషేధం, పోక్సో చట్టం అమలు, టోల్‌ఫ్రీ నెంబరు 1,098 ఏర్పాటు వంటివి కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బాలికల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలిపారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టు కున్నాయి. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. బైక్ ర్యాలీ, సంతకాల సేకరణ జరిగాయి. డీఆర్డీయే పీడీ విజయ రాజు, ఆర్డీవో అచ్యుత అంబరీష్, డీసీపీవో సూ ర్యచక్రవేణి, ఐసీడీఎస్ పీడీ శారద, డీఈవో వెంకటలక్ష్మమ్మ, డీపీవో అనూరాధ, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి, బీసీ సంక్షేమాధికా రిణి నాగరాణి, సెరీకల్చర్ డీడీ వాణి పాల్గొన్నారు.

మంచు ముసుగు

తెల్లారి 9 దాటినా మంచు ముసుగు తొలగడం లేదు.. రెండు రోజులుగాపొగ మంచు దట్టంగా కమ్మేస్తోంది.. మంచు తీవ్రతతో దారులు కనిపించని పరిస్థితి ఏర్పడింది. మంచుతో పాటు చలి చంపేస్తోంది. మంచు ఎక్కువగా ఉండటంతో ఉదయం పంట పొలాలకు వెళ్ళే కూలీలు, పాలు తీయటానికి పొలాలకు వెళ్ళే రైతులు స్కూళ్లకు వెళ్లే చిన్నారులు ఇబ్బందుల పడ్డారు.. ద్వారకాతిరుమలలో క్షేత్ర పరిసరాలు మంచుతో కప్పేశాయి..


మంచులోనే ప్రయాణం ↑ భీమవరం →




ఏలూరు

స్కూల్ టైమ్ అయినా మంచు వదల్లేదు..




వ్యవసాయ పనుల్లో రైతులు


ఇంకా తెలవారలేదే : ద్వారకాతిరుమల కొండపై..


ఆకివీడులో మంచుతెరలను చీల్చుకువస్తున్న ఉదయభానుడు


ఏలూరు శివారులో పనికి వెళ్లే హడావుడి




హ్యాండ్ బాల్ పోటీల పోస్టర్లు విడుదల చేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ లావణ్య

30 నుంచి అంతర కళాశాలల హ్యాండ్‌బాల్ పోటీలు

దెందులూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : జేఎన్‌టీయూ కాకినాడ పరిధిలో ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా, తూర్పుగోదావరి గుంటూరు, ప్రకాశం ఏడు జిల్లాల పరిధిలోని కళాశాలల హ్యాండ్ బాల్ పోటీలను ఈనెల 30 తేదీ నుంచి వేగవరంలోని హేలాపూడి ఇంజినీరింగ్ కాలేజీలో జరుగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.లావణ్య తెలిపారు. జనవరి 30 నుంచి 31వ తేదీ వరకు బాలుర విభాగంలో 25 టీంలు, బాలికల విభాగంలో 11 టీంలు పాల్గొంటాయని తెలిపారు. శుక్రవారం వేగవరం కాలేజీలో పోటీలకు సంబంధించి కరపత్రాలను కళాశాల ఏవో కరుణానిధి, ఉపాధ్యాయులు విడుదల చేశారు,

వెయిట్ లిఫ్టర్ కార్తీక్‌కు గవర్నర్ తేనీటి విందుకు ఆహ్వానం



ఏలూరు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ఏలూరు యువ వెయిట్‌లిఫ్టర్ అంబళ్ల కోమలి కార్తీక్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఈనెల 26న విజ యవాడలో జరిగే రిపబ్లిక్ డే వేడుకల్లో భాగంగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఎట్‌హోమ్ సందర్భంగా ప్రముఖులకు సాయంత్రం ఇచ్చే తేనేటి విందుకు రావాలని రాజ్‌భవన్ నుంచి ఆహ్వానం అందింది. ఇటీవల కాలంలో 96 కిలోల విభా గంలో కార్తీక్ జూనియర్ నేషనల్స్ వెయిట్ లిఫ్టింగ్‌లో స్వర్ణం, సీనియర్ నేషనల్స్‌లో రజతం వశం చేసుకున్నాడు. ప్రస్తుతం పంజాబ్‌లో ఎంబీఏ చదువుతున్నాడు. నగరంలోని కొత్త పేటకు చెందిన కార్తీక్ ఇండోర్ స్టేడియంలోని డీఎస్‌ఏ వెయిట్ లిఫ్టింగ్ కోచ్ వద్ద శిక్షణ పొందుతున్నాడు. ఇప్పటివరకు 30కు పైగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో కార్తీక్ పతకాలను వశం చేసుకున్నాడు. డీఎస్‌డీవో శ్రీని వాసరావు, రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ సెక్రటరీ బడేటి వెంక ట్రామయ్యలు కార్తీక్‌ను అభినందించారు. గవర్నర్ నుంచి తనకు ఆహ్వానం రావడం ఆనందంగా ఉందని కార్తీక్ చెప్పాడు.

పట్టిసీమ మహా శివరాత్రి ఉత్సవాల లైటింగ్ టెండరు ఖరారు


టెండర్ల కార్యక్రమంలో అధికారులు

ఏలూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాల్లో విద్యుద్దీపాలంకరణ టెండర్లను శుక్రవారం ఖరారు చేశారు. పట్టిసీమ పంచాయతీ కార్యదర్శి తాతి విజయకుమారి గూటాల పంచాయతీ కార్యాలయంలో వచ్చిన టెండర్లను పరిశీలించి ఖరారు చేసినట్టు ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్లలో ముగ్గురు పాల్గొనగా ఒకరు విత్ డ్రా అయ్యారని, రూ.1,49,000లకు టెండరు వేసిన మంద పాటి రాజు అనే వ్యక్తికి టెండరు ఖరారు చేసినట్టు కార్యదర్శి తెలిపారు.

గోదావరిలో మత్స్య సంపద కోసం చేప పిల్లల విడుదల


గోదావరిలో చేప పిల్లలు వదులుతున్న నాయకులు

ఏలూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : పోలవరం మండలంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం గోదావరిలో చేప పిల్లల సీడ్‌ను విడు దల చేసినట్టు మత్స్యశాఖ జిల్లా అధికారి జేఎస్‌ఈ నాగ లింగాచార్యులు తెలిపారు. మత్స్య సంపద అభివృద్ధి ద్వారా మత్స్యకారుల జీవనోపాధి మెరుగు పరచడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని అందులో భాగంగా చేప పిల్లలను గోదావరిలో వదిలి నట్టు తెలిపారు. పోలవరం, గూటాల గ్రామాల్లో 20 లక్షల చేప పిల్లల సీడ్‌ను గోదావరిలో విడుదల చేయగా, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆధ్వర్యంలో పోగొండ, జల్లేరు జలాశయాల్లో 120 లక్షల చేప పిల్లల సీడ్ విడుదల చేసినట్టు తెలిపారు. కూటమి నాయకులు జల్లేపల్లి రాజా, బ్యాటరీ పోశి, మిరియాల అంజిబాబు,మత్స్యకార సొసైటీ నాయకులు వెంకట్రావు, అచ్చారావు పాల్గొన్నారు.


సురభి వేణుగోపాలరావును సన్మానిస్తున్న ఎంపీపీ హరినారాయణరాజు, సర్పంచ్, ఉపసర్పంచ్‌లు నడింపల్లి సత్యవతి రామకృష్ణంరాజు, ఆలయ కమిటీ చైర్మన్ బదరీనారాయణరాజు తదితరులు

సురభి నాటకాలు మరిచిపోలేం..

ఎంపీపీ శ్రీహరినారాయణరాజు

ఉండి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సురభి నాటకాలను ప్రదర్శించిన తీరు తాము మరువలేమని ఉండి ఎంపీపీ ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు అన్నారు. గురువారం రాత్రి ఉండి మండలం కోలమూరులో సురభి నాటక సంస్థ దర్శకుడు, నటుడు వేణుగోపాలరావు, ఆయన బృందాన్ని ఘనంగా సన్మానించారు. కళాకారుల తమ సహజ నటనతో ప్రేక్షకులను మైమరిపించారన్నారు. కోలమూరు విచ్చేసి ప్రదర్శించిన నాటకాలను మరిచిపోలేమన్నారు. వేణుగోపాలరావు మాట్లాడుతూ అంతరించిపోతున్న నాటకాలకు మరోసారి జీవం పోసిన ఉండి-కోలమూరు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఉండి ఎమ్మెల్యే, ఉపసభాపతి కనుమూరు రఘు రామకృష్ణరాజుకు ధన్యవాదాలు తెలిపారు. భీమవరం మున్సి పల్ మాజీ చైర్మన్ బొమ్మిడి నారాయణరావు, నరసాపురం పార్లమెంటు బీజేపీ కన్వీనరు పేరిచర్ల సుభాష్‌రాజు, నరసరాజు, యువరాజు, రుద్రరాజు రవికుమార్ రాజు, నంబూరి బలరామరాజు, పేరిచర్ల శ్రీనివాసరాజు, అప్పలరాజు, రుద్రరాజు నరసింహరాజు, కెవి రాజు, ముదునూరి సతీష్‌రాజు, ఆలయ కమిటీ చైర్మన్ మంతెన రామరాజు పాల్గొన్నారు.

పర్యాటకం పరవశం..

నేడు జాతీయ పర్యాటక దినోత్సవం

పర్యాటకం అంటే మనసుకు ఆహ్లాదం.. ప్రశాంతతను ఇచ్చే ప్రాంతాలను సందర్శించడం.. చాలామంది ప్రతీ ఏడాది ఏదో ఒక ప్రాంతానికి వెళుతుంటారు..అది ఆధ్యాత్మిక ప్రదేశమైనా, పర్యాటకమైనా.. ఏదైనా ఆనందం కోసమే.. పిల్లలకు ఆటవిడుపుగా, పెద్దలకు మనశ్శాంతిని అందించే ప్రదేశాలు ఎన్నో ఉంటాయి.. నేడు జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా పలువురు పర్యాటక ప్రేమికులు తమ అనుభవాలను వివరించారు..




కేదారనాథ్‌లో కుటుంబంతో కలిసి ఆకుల నాగు

• అన్నీ చుట్టేయాలన్నదే నా లక్ష్యం

మన మనసును ఉత్తేజపరిచే స్థలాలు సందర్శించడం ఓ అనుభూతి నిస్తుంది. ఉల్లాసంగా..ఉత్సాహంగా గడపాలంటే టూర్ వేయాల్సిందే.. ఎక్కడ చూడదగ్గ స్థలం ఉన్నా అక్కడికి వాలిపోయే వారిలో తాడేపల్లిగూడేనికి చెందిన ఆకుల నాగు కుటుంబం ముందుంటుంది. దేశంలో చూడతగ్గ స్థలాలతో పాటు విదేశాలను కూడా చుట్టి వస్తుంటారు. ఒకసారి స్నేహితులతో మరోసారి కుటుంబంతో ఇలా అన్ని ప్రాంతాలు చుట్టేయడమే కాదు. అక్కడ విశేషాలను సోషల్ మీడియాలో స్నేహితులతో పంచుకుంటూ మనం కూడా ఆ ప్రాంతానికి వెళ్లాలనిపించేలా చేస్తుంటారు. ఫ్యామిలీ అంతా స్వీట్స్ బిజినెస్‌లో తలమునకలు అవుతుంటుంది. "తాతారావు స్వీట్స్ అంటే తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాల వారికి ఎంత ఇష్టమో నాకు పర్యాటక ప్రాంతాలు చూడటమంటే అంతే ఇష్టం. దైనందిన జీవితంలో పడి మునిగిపోవడం నాకు అసలు ఇష్టముండదు. ప్రపంచంలో అన్ని పర్యాటక ప్రదేశాలు వీక్షించాలన్నదే నా లక్ష్యం." అని చెప్పారు.

- తాడేపల్లిగూడెం రూరల్ (ఆంధ్రజ్యోతి)

• ఏటా రెండు సార్లు టూర్


వారాణసీలోని రాధాకృష్ణ మందిర్ వద్ద భగవాన్ దంపతులు

నిత్యం వృత్తి, వ్యాపారాలతో సతమతమయ్యే జీవితంలో కాస్తంత ప్రశాంతత కోసం సంవత్సరంలో కొన్ని రోజులు క్షేత్రాలను సందర్శించడం అలవాటుగా మారిందని సన్నిది చంద్ర భగవాన్ చెబుతున్నారు.ఈయన తణుకులో కిరాణా షాపు నిర్వహిస్తున్నారు. వివిధ ప్రాంతాలకు వెళ్లాలని ఆసక్తి ఉన్నప్పటికీ పిల్లలు చదువులు కారణంగా వెళ్లలేకపోయేవారమని ఇప్పుడు ప్రతీ ఏడాది ఏదో ఒక ప్రాంతానికి వెళ్లడం అలవాటు చేసుకున్నాం. రెండేళ్లుగా ప్రతీ సంవత్సరం మార్చి, ఆగస్టు నెలలో రాష్ట్రంలోని పలు అధ్యాత్మిక ప్రదేశాలతో పాటు దేశంలోని చారిత్రక ప్రసిద్ధి చెందిన ప్రదేశాలను సందిర్శిస్తాం. భార్యతో కలసి రాష్ట్రంలోని తిరుపతి, శ్రీకాళహస్తి, విజయవాడతో పాటు దేశంలోని వారణాసి, ప్రయాగరాజ్, అలహాబాద్, అయోధ్య, రామేశ్వరం, తంజావూరు, భువనేశ్వర్ , మహాబలిపురం, శబరిమలై వంటి పుణ్య క్షేత్రాలను సందర్శించా... కాశీ ఇప్పటి వరకూ 8 సార్లు వెళ్లాం. మహాబలిపురంలో ఏకశిలా రథాలు, అలహాబాద్‌లోని శక్తి పీఠం, మధుర మీనాక్షి ఆలయం, వరద రాజస్వామి దేవాల యంలో వెండి, బంగారు బల్లులు, భువనేశ్వర్‌లోని లింగరాజస్వామి ఆలయం చూడదగ్గ ప్రదేశాలని భగవాన్ తన అనుభవాలను చెప్పారు..

- తణుకు రూరల్, (ఆంధ్రజ్యోతి)

• చార్‌థామ్ యాత్ర అద్భుతం


23 కిలోమీటర్లు ట్రెక్కింగ్ చేసి కేదార్‌నాథ్ వెళ్లిన గాదె వెంకన్న

పాలకొల్లు పట్టణానికి చెందిన ఆధ్యాత్మిక వేత్త, చిన్నగోపురం మాజీ చైర్మన్ గాదె వెంకన్న ప్రతీ ఏటా ప్రకృతి అందాలు తిలకించడానికి పలు ప్రాంతాలకు వెళుతుంటారు. మన దేశంలో పర్యాటక కేంద్రాలకు లోటు లేదని తాను తిరిగిన ప్రాంతాల్లో అమితంగా నచ్చిన యాత్ర చార్ దామ్ అని అని చెప్పారు. ఈ యాత్రలో ఆధ్యాత్మికత, ఆనం దం, ఆహ్లాదం పంచింది. పర్వత ప్రాంతాలను, అటవీ ప్రాంతాలను, జలపాతాలను కలుపుతూ సాగే యాత్ర ఎంతో అద్భుతంగా, ఆశ్చర్యకరంగా ఉంటుంది.

పాలకొల్లు అర్బన్, (ఆంధ్రజ్యోతి)

• ఏడాదిలో మూడు నెలలు యాత్రలో..



"ఆధ్యాత్మిక యాత్రలు చేస్తుంటే భక్తిలో పరవశమై ప్రాణం హాయిగా ఉంటుంది.. కుటుంబ సభ్యులు స్నేహితులతో కలిసి సంవత్సరంలో మూడు నెలలు యాత్రలు చేస్తాం. జ్యోతిర్లింగాల యాత్ర నెల రోజులు సమయం పడుతుంది. సెల్‌ఫోన్లు వదిలేసి భగవంతుడ్ని స్మరిస్తూ ఉంటే ప్రాణం ఎంతో హాయిగా ఉంటుంది. శ్రీశైలం, షిరిడీ, తిరుపతి ఎక్కువగా వెళ్తుంటాం. బదరీనాథ్, కేదార్‌నాథ్ వంటి ప్రదేశాలకు వెళితే ఆత్మజ్ఞానంతో పాటు ఆనందం కలుగుతుంది.." అని తణుకు చెందిన వినుకొండ నరసింహమూర్తి చెప్పారు

ఇరగవరం,(ఆంధ్రజ్యోతి)

ఆధ్యాత్మిక ఆనందం..మనసుకు ప్రశాంతత

ఆ ప్రాంతానికి వెళ్తే చాలు మనసులో ఎంత ఒత్తిడి, ఒడిదుడుకులున్నా వెంటనే మర్చిపోతాం. అక్కడ ఆధ్యాత్మికత వాతా వరణంతో పాటూ అహ్లాదం కూడా లభిస్తుంది. పెంటపాడు మండలం కే.పెంటపాడులో బైరాగిమఠం గోపాలస్వామి ఆలయం ఆహ్లాదకరమైన వాతావరణంతో మనసులను రంజింపజేస్తుంది. 18వ శాతాబ్దం మొదట్లో ఒడిశా బైరాగి బ్రహ్మచారులచే వైష్ణవ రామానంద సంప్రదాయం ప్రకారం ఈ ఆలయం స్థాపించబడింది ఈ మఠానికి నూజివీడు జమీందారు రాజ వెంకట అప్పారావు బహదూర్ 10 పుట్ల భూమిని (100 ఎకరాలు) బహుమతిగా అందజేశారు. కాశి నుంచి రామేశ్వరం వెళ్ళే భక్తులకు సేద తీరేందుకు, వారికి భోజనవసతులు సమకూర్చేందుకు ఈ మఠం ఉండేదని చెబుతారు. బాలకృష్ణుడు చిన్ని కృష్ణుని అవతారంలో దర్శనమిస్తాడు. ఈ ప్రాంగణంలో అడుగు పెట్టగానే ప్రశాతం వాతావరణం కనపడుతుంది. కాళీయ మర్ధనుడి రూపంలో ఉన్న కృష్ణుడి విగ్రహంతో కోనేరు ఆహ్లాదాన్ని ఇస్తుంది. ఆలయం లోపలికి అడుగు పెట్టగానే తొలుత గోమాత దర్శనమిస్తుంది. ఆలయం లోపల దశా వతారాల విగ్రహాలు కనువిందు చేస్తాయి.

-పెంటపాడు (ఆంధ్రజ్యోతి)



స్కేటింగ్‌లో జెస్సీకి పతకాల పంట




రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న జెస్సీ రాజ్.. ప్రధాన మంత్రి మోదీతో.. (ఫైల్)

దెందులూరు,జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : కృషి పట్టుదల, నిరంతర సాధన ఉంటే ఉన్నత స్థానాలకు చేరవచ్చని నిరూపించి నేటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచింది జెస్సీ ఏలూరు జిల్లా దెందులూరు మండలం జోగన్నపాలెం గ్రామానికి చెందిన స్కేటర్ జెస్సీ రాజ్ రాష్ట్రపతి దౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారం అందుకుంది. జోగన్నపాలెం గ్రామానికి చెందిన మాత్రపు సురేష్, రాధ దంపతుల కుమార్తె జెస్సీ విజయవాడ ఎస్ఎంఎస్ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. చిన్ననాటి నుంచి స్కేటింగ్‌పై ఆమెకున్న ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు కోచ్ సింహాద్రి వద్ద శిక్షణ ఇప్పించారు. ఇప్పటివరకు రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయిలో స్కేటింగ్‌లో 50 పతకాలను సాధించింది. ఈ సంవత్సరం ఆసియా కప్ ప్రపంచకప్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచింది. న్యూజిల్యాండ్‌లో జరిగిన ప్రపంచ ఓషియానా పసిఫిక్ కప్ చాంపియన్ షిప్ -2024 పోటీల్లో పాల్గొని దేశానికి బంగారు పతకాన్ని సాధించింది. ఆమె ప్రతిభను గుర్తించిన ఏపీ ప్రభుత్వం ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ 2025కు సిఫార్సు చేసింది. డిసెంబరు 26న భారత రాష్ట్రపతి కార్యాలయంలో రాష్ట్రపతి దౌపది ముర్ము జెస్సీరాజ్‌కు అవార్డు అందజేయగా ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు.తల్లిదండ్రుల ప్రోత్సాహం, కోచ్ శిక్షణతోనే ఈ విజయం సాధించినట్టు జెస్సీ రాజ్ తెలిపింది. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్, జోగన్నపాలెం సర్పంచ్ పసుమర్తి రాజేశ్వరి, మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రావు, పసుమర్తి మధుబాబుతో పాటు పలువురు జెస్సీని జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా అభినందించారు,


దువ్వలో పురుగు మందులు వెదజల్లే డ్రోన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ ధనరాజు, చీర్ల రాధయ్యులు

యంత్రాలతో సాగు ఖర్చులు తగ్గించాలి

తణుకు రూరల్, జనవరి 24, (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయంలో యంత్రాల వినియోగం ద్వారా ఖర్చులు తగ్గి లాభసాటిగా చేసుకోవాలని ఎంపీపీ రుద్ర ధనరాజు చెప్పారు. శుక్రవారం తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో డ్రోన్ సహాయంతో పురుగు మందుల పిచికారీ పనులను ప్రారంభించారు. వైసీపీ నాయకుడు చీర్ల రాధయ్య, గ్రామ టీడీపీ అధ్యక్షుడు శిరిగిశెట్టి వెంకటేశ్వరరావు, ఏవో కుసుమ, డ్రోన్ ఆపరేటర్లు మద్దూరి లక్ష్మణ్, నారాయుడు, మద్దూరి రాంబాబు, ఇతర వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



యమునాపల్లిలో ఐదు తరగతుల విద్యార్థులకు ఒకేసారి విద్యాబోధన చేస్తున్న టీచర్



దిరుసుమర్రులో విలీనమైన పాఠశాల

ఎలిమెంటరీ స్కూళ్ల బలోపేతానికి

ప్రభుత్వం దృష్టి

» 60 మందికిపైగా విద్యార్థుల తరగతికో టీచర్‌తో బోధన ఇచ్చేలా ఆలోచన

» గత ప్రభుత్వం చేసిన విలీన స్కూళ్లపై వచ్చే విద్యా సంవత్సరంలో మార్పునకు పరిశీలన

» పశ్చిమ జిల్లాలో 952 స్కూళ్లకు 1,892 ఉపాధ్యాయులు.. మార్పు జరిగితే టీచర్లు పెరిగే అవకాశం

భీమవరం రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఎలిమెంటరీ బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్టు కనిపిస్తుంది. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడంతోపాటు బోధన కూడా ప్రణాళికగా జరగాలనే ఆలోచనలు చేస్తుంది. ఎలిమెంటరీ పాఠశాలల్లో విద్యావిధానం మార్పులపై పరిశీలన మొదలుపెట్టింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొత్త విధానాలు తీసుకురావడానికి ఇప్పటి నుంచే విధివిధానాలను విద్యాశాఖాధికారులు తెలిపేలా ఆదేశాలు జారీ చేసింది. పశ్చిం గోదావరి జిల్లాలో 952 ప్రభుత్వ ఎలిమెంటరీ స్కూళ్ళు ఉన్నాయి. వాటిలో 1,892 మంది ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 20లోపు విద్యార్థులు ఉండడం, ఒకే ఉపాధ్యాయుడు బోధనకు ఉండాల్సి వస్తుంది. దీంతో విద్యాబోధన ఐదు తరగతులకు ఒక ఉపాధ్యాయుడే చెప్పడం కొంత ఇబ్బందికరమైన విషయంగా పరిగణనలోకి ప్రభుత్వం తీసుకున్నట్టే కనిపిస్తుంది. దీనిలో భాగంగానే 60 మంది విద్యార్థులు పైబడి ఉన్న పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున ఐదు తరగతులకు ఐదుగురు ఉపాధ్యాయులను నియమించి విద్యాబోధన ప్రణాళికాబద్ధంగా సాగించాలనే ఆలోచనలు చేస్తున్నట్లు సమాచారం. దీని వల్ల అదనపు ఉపాధ్యాయులను భర్తీ చేసే అవకాశం ఉండడంతో మెగా డీఎస్సీ ద్వారా వాటిని భర్తీ చేసుకునేందుకు కూడా వీలుంటుంది.

యథావిధిగా గత విలీన పాఠశాలలు..

గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో 123 పాఠశాలలు విలీన బాట పట్టించారు. వాటిలో చదువుతున్న 3, 4, 5 తరగతుల విద్యార్థులు ఆ పాఠశాలలకు సమీపంలో ఉన్న హైస్కూల్‌లో బోధన చేసేలా ఏర్పాట్లు చేశారు. దాదాపుగా మూడు వేల మంది విలీనబాటలో ప్రభుత్వ హైస్కూళ్లలోకి వెళ్ళాల్సి వచ్చింది. ఆ సమయంలో పాఠశాలలు దూరమవుతున్నాయన్న ఆలోచనతో విద్యార్థుల తల్లిదండ్రులు కొన్నిచోట్ల నిరసనలు వ్యక్తం చేశారు. అయినప్పటికీ విలీనంలో వెనకడుగు వేయలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం విలీనమైన పాఠశాలలను గతంలో మాదిరిగా నిర్వహించేలా పరిశీలన మొదలు పెట్టింది. విద్యార్థుల తల్లిదండ్రుల ఆలోచన ఎలా ఉందన్న దానిపై కూడా వివరాలు సేకరించి వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాత తరహాలో విలీనమైన పాఠశాలలను నడిపించేలా అడుగులు వేస్తుంది.

వెళ్లిన వారిని వెనక్కి తీసుకురావాలి

ప్రభుత్వ పాఠశాలల్లో గడిచిన ఐదేళ్ళలో విద్యార్థుల సంఖ్యలో వెనుకబడుతూ వచ్చాయి. జిల్లాలోని 1,375 పాఠశాలల్లో ఐదేళ్ళ క్రితం లక్షా 38 వేల మంది విద్యార్థులు ఉండేవారు. ఈ విద్యా సంవత్సరం లెక్క ప్రకారం లక్ష మంది విద్యార్థులు మాత్రమే చదువుతున్నారు. అంటే 38 వేల మంది ప్రైవేట్ బాట పట్టారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో మార్పులు తీసుకువచ్చి వెళ్ళిపోయిన విద్యార్థులను తిరిగి ప్రభుత్వ స్కూళ్లకు వచ్చేలా ప్రభుత్వం ఆలోచనలు చేస్తుంది.

వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొత్త నిర్ణయాలు !

ప్రభుత్వ ఎలిమెంటరీ పాఠశాలలపై పరిశీలన జరుగుతుంది. ఏ పాఠశాల ఎంత దూరం ఉన్నది, ఎంత మంది విద్యార్థులు ఉన్నారు. అనేవి పూర్తి వివరాలు తీసుకుంటున్నాం. గతంలో విలీనమైన పాఠశాలలపై కూడా విద్యార్థుల తల్లిదండ్రులు ఆలోచనపై కూడా పరిశీలన చేస్తాం. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొత్త నిర్ణయాలు ఉండే అవకాశం ఉంది.

- నారాయణ, డీఈవో, పశ్చిమ గోదావరి జిల్లా

ఒకటి నుంచి హెల్మెట్లు తప్పనిసరి : కలెక్టర్

ఏలూరు క్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలకు వాహనాలపై వచ్చే ఉద్యోగులు ఫిబ్రవరి 1 నుంచి తప్పనిసరిగా హెల్మెట్ ధరించి రావాల్సిందేనని ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో ఎస్పీ కేపీఎస్ కిశోర్‌తో కలిసి ఆమె రహదారి భద్రతా, రోడ్డు భద్రతా వారోత్సవాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహన చోదకుల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలతో వారి కుటుంబాలకు తీవ్ర మనోవేదనకు గురిచేస్తున్నారని దీనిని దృష్టిలో ఉంచుకుని రోడ్డు భద్రతా నియమాలపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. హెల్మెట్ ధారణపై మరింత విస్తృత చర్యల్లో భాగంగా తొలిగా ప్రభుత్వ కార్యాలయాలకు వాహనాలపై వచ్చే ఉద్యోగులు హెల్మెట్ ధరించి రావాలనే నిబంధన ఫిబ్రవరి ఒకటి నుంచి అమలు చేయాలన్నారు. ఇందుకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. కళాశాలలకు వచ్చే వాహనదారులు హెల్మెట్ ధరించి రాకపోతే నో ఎంట్రీ అని స్పష్టం చేయాలన్నారు. ఒకటికి రెండుసార్లు తొలిగా హెచ్చరించి తదుపరి కేసులు నమోదు చేయాలన్నారు. ఆర్టీసీ బస్సులను స్పీడ్ పరిమితి దాటి వేగంగా నడిపితే సంబంధిత ఫోన్ నంబరుకు సమాచారం అందించాలనే స్టిక్కర్లను బస్సులపై అతికించాలని ఆదేశించారు. ఎస్పీ కిశోర్ మాట్లాడుతూ హెల్మెట్ తప్పనిసరి అని లేదంటే ఎంట్రీ నిషిద్ధం అనే అంశాన్ని ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలలు, విద్యాసంస్థల్లో అమలు చేసి మిగిలిన ప్రజలకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఇన్‌ఛార్జి ఉపరవాణా కమిషనరు కేఎస్ఎంవీ కృష్ణారావు, జంగారెడ్డిగూడెం ఆర్డీవో మహ్మద్‌మదాని, జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, ఆర్ అండ్‌బీ ఎస్ఈ జాన్ మోషే, జిల్లా ప్రజారవాణాధికారి వరప్రసాద్, మున్సిపల్ కమిషనరు ఎ.భాను ప్రతాప్, డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌వీ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



తాతకు తలకొరివి పెట్టిన మనుమరాలు

యలమంచిలి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవిపాలెం గ్రామానికి చెందిన వినుకొండ నాగేశ్వరరావు (60) శుక్రవారం ఉదయం గుండెపోటుతో మరణించారు. మృతుడు నాగేశ్వరరావు కుమారుడు సుమారు నాలేగుళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. నాగేశ్వరరావు మనుమరాలు శరణ్య తలకొరివి పెట్టి అంత్యక్రియలు నిర్వహించింది. సుమారు 12 ఏళ్ల బాలిక శరణ్య తలకొరివిపెట్టి తాతయ్య రుణం తీర్చుకుందని గ్రామస్థులు పేర్కొన్నారు.

శ్రీవారి ఆలయ పాలక మండలికి వీడ్కోలు

» వైసీపీ సభ్యులతో ముగిసిన ట్రస్టు బోర్డు చివరి సమావేశం

» ఫిబ్రవరి 8వ తేదీతో పాత పాలకమండలి రద్దు

» నూతన పాలక మండలికి కూటమి నేతల ప్రయత్నాలు





చివరి సమావేశంలో పాల్గొన్న వైసీపీ పాలకమండలి సభ్యులతో ట్రస్టీ, ఈవోలు

ద్వారకాతిరుమల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి శేషాచల కొండపై శుక్రవారం గత వైసీపీ ప్రభుత్వం నియమించిన సభ్యులతో చివరిసారిగా ట్రస్టు బోర్డు సమావేశం జరిగింది. ప్రస్తుతం ఉన్న పాలక మండలి 2023 ఫిబ్రవరి 9న 16 మంది ధర్మకర్తలతో ఏర్పడింది. ఆలయ అనువంశిక ధర్మకర్త రాజా ఎస్వీ సుధాకరరావు చైర్మన్‌గా, ఆలయ ప్రధాన అర్చకులు పీవీఎస్ఎస్ఆర్ జగన్నాధాచార్యులు ఎక్స్ అఫీషియో సభ్యునిగా, అప్పటి ప్రభుత్వ నియమించిన మరో 14 మంది సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కూటమి ప్రభుత్వ ఏర్పడి దాదాపు ఏడాది కావస్తున్నా పదవుల నుంచి వైదొలగలేదు. చైర్మన్‌గా వ్యవహరిస్తున్న అనువంశిక ధర్మకర్త, ఎక్స్ అఫీషియో సభ్యుడు మినహా మిగిలిన 14 మంది ప్రభుత్వం మారినా ట్రస్టీలుగానే నామినేటెడ్ పదవుల్లో ఉన్నారు. అటు దేవస్థానం ఇటు ప్రస్తుత కూటమి ప్రభుత్వం జోక్యం చేసుకోలేదు.

వైసీపీ హయాంలో రెండు సార్లు ట్రస్టు బోర్డు..

కూటమి ప్రభుత్వం కొలువుదీరిన క్రమంలో వైసీపీ హయాంలో నామినేటెడ్ పదవులు పొందిన పలువురు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. వైసీపీ పాలనలో శ్రీవారి దేవస్థానానికి రెండుసార్లు పాలకమండలి నియామకాలు జరిగాయి. ఆలయానికి 14 మంది సభ్యులతో 2011లో తొలిసారిగా ఏర్పాటైన ట్రస్టు బోర్డు 2013 వరకు కొనసాగింది. ఆ తరువాత చట్టపరిధిలోని అంశాలకు లోబడి అప్పటి ప్రభుత్వం ఐదేళ్లపాటు ట్రస్టుబోర్డు నియామకం జరుగకుండా మినహాయింపునిచ్చింది. తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం మొదటిసారి 2020 ఫిబ్రవరి 20న శ్రీవారి దేవస్థానానికి ట్రస్టు బోర్డును నియమిస్తూ అప్పటి ప్రిన్సిపల్ కార్యదర్శి వి.ఉషారాణి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రమాణస్వీకారం చేసిన నాటి నుంచి రెండేళ్లపాటు వారు విధులు నిర్వర్తించారు. అనంతరం నియామకాలు జరుగకపోవడంతో ఆ బోర్డు పదవీకాలాన్ని పొడిగించారు. మరోసారి 2023 ఫిబ్రవరి 9న 16 మంది ధర్మకర్తలతో పాలకమండలి ఏర్పడింది. ప్రస్తుతం వున్న పాలక మండలికి 2025 ఫిబ్రవరి 8 వరకు గడువు ఉండడం గమనార్హం.

పాలకమండలి సభ్యులకు వీడ్కోలు

శేషాచల కొండపై ట్రస్టుబోర్డు సమావేశం పూర్తయిన తర్వాత నామినేటెడ్ పదవుల్లో ఉన్న 14 మంది పాలక మండలి సభ్యులకు వీడ్కోలు పలికారు. వారందికీ శ్రీవారి శేషవస్త్రాలను కప్పి స్వామి అమ్మవార్ల చిత్ర పటాలు, ప్రసాదాలను ఆలయ చైర్మన్ సుధాకరరావు, అనువంశిక ధర్మకర్త నివృతరావు, ఈవో వేండ్ర త్రినాథరావు అందించారు.

కూటమి నేతల ప్రయత్నాలు

కూటమి ప్రభుత్వంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూర్పుతో నూతన పాలకమండలిలో చోటు కోసం ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో ఆలయం అంటే ఆధ్యాత్మికత అని మర్చిపోయి కొందరు ట్రస్టుబోర్డు సభ్యులు హడావుడి చేశారు. స్వామి సేవ చేసుకునే భాగ్యం కోసం ఎందరో తపిస్తుంటారు. గత పాలకమండలిలో నియమితులైన ఓ వ్యక్తి ఇది తన హోదాకు తగినది కాదని రాజీనామా చేసి మరో పదవి కొట్టేశారు. సెక్షన్ 18, దేవదాయ చట్టం ప్రకారం ఒక వ్యక్తి ట్రస్టీగా నియమితులయ్యేందుకు దేవుని పట్ల విశ్వాసము, నమ్మకం, క్రిమినల్ కేసులు లేని భక్తిభావం, దైవచింతన కలిగిన వారిని కూటమి ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని కొత్త పాలకమండలి ఎంపిక ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

పంటలకు రుణ పరిమితి నిర్ధారణ : కలెక్టర్

ఏలూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు పంటలకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ (రుణ పరిమితి)ని నిర్ధారించినట్లు ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి శుక్రవారం తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు(డీసీసీబీ) ఆధ్వర్యంలో జిల్లా సాంకేతిక కమిటీ సమావేశంలో నిర్ణయించారు. ఆమె మాట్లాడుతూ వ్యవసాయ, మత్స్యశాఖ, ఉద్యాన, పశు సంవర్థక శాఖల నుంచి పలు రుణాల మంజూరు కోసం రుణ పరిమితి వివరాలను రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రేపు ఉమ్మడి జిల్లా ట్రెజరీ ఉద్యోగుల కార్యవర్గ ఎన్నికలు

ఏలూరు అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీ ఎస్టీఏ) ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా శాఖ నూతన కార్యవర్గ ఎన్నికలు ఈనెల 26న ఏలూరు జిల్లా ఖజానా అధికారి కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యు.వి. పాండురంగారావు, కె.సత్య నారాయణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల అధికారిగా ఏపీ ఎన్జీవోల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సీహెచ్.శ్రీనివాస్ వ్యవహరిస్తారు. ఉమ్మడి జిల్లాలోని ట్రెజరీ శాఖ ఉద్యోగులందరూ ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని కోరారు.



కాళ్లకూరు వెంకన్న సన్నిధిలో ఎమ్మెల్యే ధర్మరాజు, చినబాబు, కాలినడక వస్తున్న నాయకులు

కాళ్లకూరు వెంకన్నకు మొక్కు తీర్చుకున్న జనసేన నేతలు

కాళ్ళ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : కాళ్లకూరు వేంకటేశ్వర స్వామికి జనసేన నేతలు శుక్రవారం మొక్కు చెల్లించుకున్నారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు (చినబాబు) జనసేన నాయకులతో కలిసి భీమవరం నుంచి కాలినడకన కాళ్లకూరు వెంకన్న సన్నిధికి చేరుకుని మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వీరికి దారి పొడవునా జనసేన నాయకులు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలియుగ దైవం వేంకటేశ్వరస్వామిని గడిచిన ఎన్నికల ముందు దర్శించుకుని మొక్కుకున్నామని, మళ్లీ ఇన్ని రోజులకు స్వామివారి దర్శన భాగ్యం కలిగిందన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో ఆంధ్రరాష్ట్రం సుభిక్షంగా ఉండి ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జనసేన ఉండి ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, కాళ్ళ మండలాధ్యక్షుడు ఏరుబండి రామాంజనేయులు, చెనమల్ల చంద్రశేఖర్, మేకా కాళీచరణ్, జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పది మంది జూదరుల అరెస్ట్

» రూ.83,500 నగదు స్వాధీనం

పెదవేగి, జనవరి 24 (ఆంధ్ర జ్యోతి) : విజయరాయి గ్రామంలో పేకాట ఆడుతున్న సమాచారంతో దాడిచేసి పది మంది జూదరులను అరెస్టు చేశామని పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ శుక్రవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.83,500 నగదు, పది సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అరెస్ట్ చేసిన జూదరులను కోర్టులో హాజరుపర్చుతామన్నారు.



కాల్వలో దూకిన యువకుడిని కాపాడిన ఫైర్ అండ్ పోలీస్ సిబ్బంది

యువకుడిని రక్షించిన పోలీసులు, ఫైర్ అధికారులు

భీమవరం క్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : భీమవరం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో చిన్న వంతెన పైనుంచి ఓ యువకుడు యనమదుర్రు డ్రెయిన్‌లోకి దూకాడు. పట్టణానికి చెందిన నక్కా రాజేష్ (19) వంతెనపై నడుచుకుంటూ వెళుతూ శుక్రవారం మధ్యాహ్నం కాల్వలోకి దూకాడు. సమాచారం అందుకున్న ఫైర్ అధికారులు, పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకుని రక్షించే ప్రయత్నం చేశారు. తాళ్ల సాయంతో పైకి తీసుకువచ్చి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి పోలీసు స్టేషన్‌లో ఉంచారు. ఆ యువకుడు కాల్వలోకి దూకడానికి గల కారణాలు తెలియలేదు. డ్రెయిన్‌లోకి దూకిన యువకుడు ఫిల్లర్లను పట్టుకుని ఉండిపోవడం వల్లే ప్రాణాలు దక్కాయని అక్కడ ఉన్నవారు చెబుతున్నారు.

క్రైమ్ కార్నర్

లారీ డ్రైవర్‌కు మూడు నెలల జైలు

నూజివీడు టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వాహనాన్ని నిర్లక్ష్యంగా నడిపి, ఇద్దరు మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు మూడునెలలు జైలుశిక్ష, రూ.200 జరిమానా విధిస్తూ శుక్రవారం నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి తీర్పు చెప్పారు. 2020, సెప్టెంబరు 26న బాపులపాడు మండలం కానుమోలుకు చెందిన దాసరి లెనిన్ ఆయన కుమార్తె వంజరపు శ్రీదేవి ద్విచక్రవాహనంపై మచిలీపట్నం వెళుతుండగా కానుమోలు శివారు లింగంచెరువు వద్ద వీరిని ఎదురుగా వస్తున్న లారీ బలంగా ఢీ కొట్టింది. దీంతో లెనిన్, శ్రీదేవి తీవ్ర గాయాల పాలై ఘటనా స్థలంలోనే మృతి చెందారు. హనుమాన్ జంక్షన్ పోలీసులు కేసు నమోదు చేయగా, విచారణ అనంతరం న్యాయమూర్తి ఏలూరుకు చెందిన లారీ డ్రైవర్ నల్లా ప్రభాకర్‌కు మూడు నెలలు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

తెలంగాణ మద్యం పట్టివేత

కుక్కునూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాజీవ్‌నగర్ గ్రామంలో 16 తెలంగాణ మద్యం సీసాలతో ఉన్న వ్యక్తిని జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ శాఖ సిబ్బంది శుక్రవారం పట్టుకున్నారు. నాటు సారా, తెలంగాణ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సిబ్బంది హెచ్చరించారు. దాడిలో ఎస్ఐలు వెంకటలక్ష్మి, ఎన్.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



గోతిలో పడిన కారు నుంచి బాధితులను బయటకు తీస్తున్న స్థానికులు

అదుపు తప్పి కారు బోల్తా

» డ్రైవర్‌కు చికిత్స అందించిన డాక్టర్

చింతలపూడి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మిరెడ్డిపల్లి గ్రామం వెళ్లే దారిలో ప్రగడవరం గ్రామం వద్ద మలుపు తిరుగుతున్న మారుతీకారు అదుపు తప్పి బోల్తా కొట్టి గోతిలో పడింది. ఈ ప్రమాదాన్ని చూసిన స్థానికులతోపాటు కె.గోకవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.కృష్ణకిషోర్ కారులో ఇరుక్కుపోయిన మఠంగూడెం గ్రామానికి చెందిన సిద్ధాంతిని, డ్రైవర్‌ను బయటకు తీసి చికిత్స జరిపారు. ఆ గుంతను పరిశీలించి రోడ్డు మలుపులో తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

డ్వాక్రా రుణాల సొమ్ము స్వాహా

» అంకన్నగూడెం పంచాయతీలో రూ.5 లక్షల వరకు చేతివాటం చూపిన సీఏ

» గిరిజన మహిళల గగ్గోలు » బాధితుల ఫిర్యాదుతో ఏపీఎం ఝాన్సీ విచారణ



దిబ్బగూడెంలో బాధిత గిరిజన డ్వాక్రా మహిళలు

జీలుగుమిల్లి, జనవరి, 24 : (ఆంధ్రజ్యోతి) : వారంతా కూలి పని చేసుకుంటూ ఎకరం, రెండెకరాల వ్యవసాయ సాగు కోసం అప్పు చేసి పెట్టుబడి పెట్టి వచ్చిన పంట ఆదాయంతో కుటుంబాల్ని నెట్టుకొస్తున్నారు. వారంతా చదువులేని అమాయకులు కావడంతో ప్రభుత్వం డ్వాక్రా మహిళల అభివృద్ధి కోసం ఇచ్చే ఉన్నతి రుణాలు వారికి తెలియకుండానే ఒక్కొక్కరికి రూ.50వేలు చొప్పున బ్యాంకులో డ్వాక్రా మహిళల పేరున సీఏ టి.పవిత్ర రుణాన్ని మంజూరు చేయించింది. అనంతరం ఆ సొమ్ము తన సొంత ఖర్చులకు వినియోగించింది. కొన్ని నెలలు వాయిదాల రూపంలో బ్యాంకులకు ఆమె జమ చేసిందని తర్వాత కట్టలేని పరిస్థితిలో విషయం బయటకు వచ్చినట్టు డ్వాక్రా మహిళలు చెబుతున్నారు. ఈ రకంగా రూ.5 లక్షల వరకు కాజేసినట్టు తెలుసుకున్న మహిళలు లబోదిబో మన్నారు. వెలుగు ఏపీఎం ఝాన్సీకి ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. వివరాలివి.. అంకన్నగూడెం పంచాయతీ దిబ్బగూడెంలో సంధ్య, చామంతి గ్రూపు సభ్యులైన ముచ్చిక దయామణి, చోడెం రాములమ్మ, కొవ్వాసి పార్వతి, నాగలక్ష్మి, చోడెం ముక్కమ్మ పేరున లబ్ధిదారులకు తెలియకుండా ఒక్కొక్కరి పేరున రూ.50వేలు రుణం తీసుకున్నట్లు వాపోయారు. రెడ్డిగూడెం, రామచంద్రాపురంలో కూడా ఇదే తరహాలో మరికొందరి పేరున రుణాలు కాజేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై వెలుగు ఏపీఎంకు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం ఆమె క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. పూర్తి విచారణ జరపాల్సి ఉందన్నారు.

నా పేరున ఆన్‌లైన్ చేసి మోసగించారు



ఉన్నతి లోన్ అడగ్గా సీఎం తన పేరున ఆన్‌లైన్ చేయించింది. కొద్ది రోజుల తర్వాత రుణం మంజూరు జాబితాలో పేరు రాలేదని తెలిపింది. గుట్టుచప్పుడు కాకుండా రూ.50వేలు రుణం వాడుకుంది.

- ముచ్చిక దయామణి
సంధ్య గ్రూపు సభ్యురాలు

తెలియకుండా రుణం మంజూరు చేశారు..



నాకు తెలియకుండా నా పేరున రూ.50వేలు రుణం మంజూరు చేసి తీసుకున్నారు. కొద్ది రోజుల తర్వాత ఇతర గ్రూపు సభ్యుల ద్వారా విషయం తెలిసింది. సీఏను అడితే నెలానెలా ఆ రుణం చెల్లిస్తానని చెబుతుంది.

- చోడెం ముక్కమ్మ
చామంతి గ్రూపు సభ్యురాలు

పిట్టలోళ్ల గుడిసెలు దగ్ధం

» బైరవపట్నం సమీపంలో ప్రత్తిపాడు స్టేజీ వద్ద ఘటన

» పది మందికి గాయాలు.. అందులో ఆరుగురి పరిస్థితి విషమం

మండవల్లి, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : మండవల్లి మండలం బైరవపట్నం సమీపంలోని ప్రత్తిపాడు స్టేజీ వద్ద నివాసముంటున్న పిట్టలోళ్ల గుడిసెలు ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగి సుమారు 20 చిన్నపాటి గుడిసెలు శుక్రవారం రాత్రి దగ్ధమయ్యాయి. చేపల చెరువుపై పిట్టలు వాలకుండా కాపలాకు పొరుగు ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 25 కుటుంబాల వారు ప్రత్తిపాడు స్టేజి సెంటరులో తాత్కాలిక గుడిసెలు ఏర్పాటు చేసుకుని నివశిస్తున్నారు. శుక్రవారం రాత్రి ఆ గుడిసెలలో దోమల నివారణకు వెలిగించిన నిప్పు ప్రమాదానికి కారణమైందని భావిస్తున్నారు. పిట్టల కాపలా కోసం వినియోగించే గన్‌లో మందుకు నిప్పు అంటుకోవడంతో ఈ ప్రమాదం సంభవించిందని భావిస్తున్నారు. ఒక్కసారిగా గుడిసెలో పేలుడు శబ్ధం విన్పించి మంటలు చెలరేగినట్టు స్థానికులు తెలిపారు. సుమారు పది మంది వరకు గాయాలతో కైకలూరు ఆసుపత్రికి తరలించారు. వారిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. వీరిలో నలుగురు పురుషులు, ఒక మహిళ, రెండేళ్ల బాలుడు ఉన్నారు. అగ్నిప్రమాద కేంద్రానికి సమాచారం ఇచ్చిన ప్పటికి అందుబాటులో వాహనం లేకపోవడంతో గుడిసెలు పూర్తిగా మంటల్లో కాలిపోయాయి. గుడిసెల్లో నిద్రపోతున్న వారు రోడ్డుపైకి పరుగులు తీసుకుంటూ వచ్చేశారు.



ప్రత్తిపాడు స్టేజీ వద్ద అగ్నిప్రమాదంలో కాలిపోతున్న పిట్టల వాళ్ల గుడిసెలు

తండ్రి మందుల కోసం వెళుతూ..

» వాహనం ఢీకొని కుమారుడి మృతి మరొకరికి గాయాలు

ఏలూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : తండ్రికి అనారోగ్యంగా ఉండడంతో మందుల కోసం జంగారెడ్డిగూడెం వెళ్తున్న కుమారుడు కమటం చరణ్‌తేజ్ (18)ను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి మృతి చెందిన ఘటన శుక్రవారం జరిగింది. ఎస్ఐ ఎస్‌కే జబీర్ తెలిపిన వివరాలివి.. జంగారెడ్డిగూడెం మండలం చల్లావారి గూడెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన కమటం భాస్కర్‌కు అనారోగ్యంగా ఉండడంతో జంగారెడ్డిగూడెం వెళ్లి మందులు తీసుకురావడానికి కుమారుడు అతని స్నేహితుడు పెడపెట్ల సన్నీ బైక్‌పై బయలుదేరారు. జంగారెడ్డిగూడెం మండలం వేగవరం కంటి ఆసుపత్రి వద్దకు చేరుకునేసరికి గుర్తు తెలియని వాహనం నిర్లక్ష్యంగా వేగంగా నడుపుకుంటూ ఎదురుగా వచ్చి బైక్‌ను ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో చరణ్‌తేజ్‌కు రక్తపు గాయాలయ్యాయి. అతడి స్నేహితుడు సన్నీకి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వారిద్దరిని జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే చరణ్ మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. సన్నీని మెరుగైన వైద్యం నిమిత్తం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చరణ్‌తేజ్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

జంగారెడ్డిగూడెంలో చోరీ

ఏలూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) జంగారెడ్డిగూడెం పట్టణంలోని మారుతీ నగర్‌లో వున్న షేక్ బాషా ఇంటి తలుపులు పగులగొట్టి లోపల ఉన్న రూ.1,52,000 విలువైన బంగారు ఆభరణాలు, రూ.2500 నగదును దొంగలు తస్కరించారని బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎస్‌కె. జబీర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలివి.. ఈనెల 23వ తేదీ రాత్రి షేక్ బాషా బెడ్ రూంలో పడుకుని తెల్లవారుజామున నిద్ర లేచి చూడగా ఇంటి తలుపులు పగులగొట్టి బట్టల మధ్య పెట్టిన బంగారం, నగదు తస్కరించారన్నారు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

కామవరపుకోట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటు హక్కు వినియోగం, ప్రాముఖ్యత అనే అంశంపై శుక్రవారం వ్యాస రచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఎం.మల్లేశ్వరరావు మాట్లాడుతూ విద్యతో పాటు విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని, సాంస్కృతిక పోటీల్లో తప్పనిసరిగా పాల్గొని నైపుణ్యాన్ని, సామర్థ్యాన్ని పెంచుకోవాలని ప్రిన్సిపల్ సూచించారు.

కోర్టు ఫీజు స్టాంపుల కొరత

ఏలూరు క్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : కోర్టు ఫీజు స్టాంపులు దొరకక చాలా కాలం నుంచి కోర్టుల్లో లాయర్లు, గుమస్తాలు, కక్షిదారులు చాలా ఇబ్బం దులకు గురవుతున్నారని వెంటనే కోర్టు ఫీజు స్టాంపుల కొరతను తీర్చాలని ఒక వినతిపత్రాన్ని ఏలూరు జిల్లా రిజిస్ట్రార్‌కు ఏలూరు న్యాయవాద గుమస్తాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నల్లా రాము శుక్రవారం అందించారు. జిల్లాలో కోర్టు ఫీ స్టాంపులు రూపాయి, రెండు రూపాయలు, ఐదు రూపాయలు, ఇరవై రూపాయలు విలువల గల స్టాంపులు తీవ్ర కొరతగా ఉందని వెంటనే ఈ స్టాంపులను కొరత లేకుండా చేయాలని కోరారు.

ఏఐటీయూసీ క్యాలెండర్ల ఆవిష్కరణ

ఏలూరు కార్పొరేషన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : ఏఐటియుసికి అనుబంధ సంఘమైన ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రచురించిన 2025 క్యాలెండర్లను శుక్రవారం విద్యుత్‌శాఖ ఏలూరు ఎస్‌సి సాల్మన్‌రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వలన విద్యుత్ మీటర్ రీడర్స్ ఉపాధికి నష్టం జరిగే ప్రమాదం పొంచి ఉందన్నారు. మీటర్ రీడర్స్‌కు వారి విద్యార్హతలను బట్టి విద్యుత్‌శాఖలో వివిధ పో స్టులను కేటాయించాలని యూనియన్ నాయకులు బండి వెంకటేశ్వరరావు, ఓ.శ్రీనివాసరావులు కోరారు.

సమస్యలను 'మండలి'లో లేవనెత్తుతా : ఎమ్మెల్సీ

ఏలూరు అర్బన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యలను శాసన మండలి సమావేశాల్లో లేవనెత్తి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి భరోసా ఇచ్చారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తనను ఎమ్మెల్సీగా గెలిపించినందుకు శుక్రవారం నగరంలోని పలు విద్యా సంస్థలను సందర్శించి ఉపాధ్యాయులు, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏ, కొత్త పీఆర్సీ వేతనస్కేళ్ళు అంశాలతో పాటు, మధ్యంతర భృతిగా 30 శాతం చెల్లించాలని మండలి సమావేశాల్లో ప్రభుత్వంపై ఒత్తిడితెస్తానని వివరించారు.

ఐసీడీఎస్, వెలుగు కార్యాలయాల్లో ముగ్గుల పోటీలు

లింగపాలెం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా లింగపాలెం మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీల్లో రెవెన్యూ, ఐసీడీఎస్, వెలుగు కార్యాలయాల్లోని మహిళా సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని సీనియర్ ఓటర్లకు సన్మాన కార్యక్రమం ఉంటుందని మండలంలో నూతనంగా ఓటు హక్కును పొందేవారికి ఓటు హక్కుపై అవగాహనా కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు.

విద్యార్థుల రోల్‌ను పరిశీలించిన పంకజ్ కుమార్

చింతలపూడి, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : విద్యాశాఖలో పాఠశాలల్లో పాత విధానం అమలు చేయడానికి విద్యార్థుల హాజరును సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ డాక్టర్ పంకజ్‌కుమార్ మండలంలోని పలు పాఠశాలలను పరిశీలించారు. రేచర్ల, యర్రగుంటపల్లి, ప్రగడవరం గ్రామాల్లో హైస్కూల్, ఎంపీపీ పాఠశాలలకు వెళ్ళి ఆన్‌లైన్‌లో రోల్ ఎంత, మాన్యువల్‌లో రోల్ ఎంత వస్తుందని పరిశీలించారు. గత ప్రభుత్వం 3, 4, 5 తరగతులను హైస్కూలులో విలీనం చేయడం వలన 1, 2 తరగతుల పాఠశాలల్లో రోల్ తగ్గిపోతుంది. ఆయన వెంట ఎంఇఓలు జి.రామారావు, కిరణ్ ఉన్నారు.

మాజీ సీఎం కర్పూరి ఠాగూర్ జయంతి

చింతలపూడి, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : పట్టణ నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ భారతరత్న అవార్డు గ్రహీత కర్పూరి ఠాగూర్ 101వ జయంతి పట్టణంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి డాక్టర్ ఎ.సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఠాగూర్ జీవిత చరిత్రను వివరించారు. కార్యక్రమంలో పెద్దలు ఎ.రాజారావు, సాయి, శేషు, అప్పారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కనకదుర్గాంబకు కుంకుమార్చనలు

ఏలూరు కార్పొరేషన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని బావిశెట్టివారిపేటలోని శ్రీకనకదుర్గాంబ ఆలయం వద్ద శుక్రవారం అమ్మవారికి విశేష అలంకరణ జరిపి ఆలయ అర్చకులు యడవల్లి శ్రీహరి శర్మ భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుని భక్తి సంకీర్తనలు ఆలపించి భజనలు నిర్వహించారు. ధ్వజస్తంభాల వద్ద మహిళలు దీపారాధనలు నిర్వహించి భజనలు నిర్వహించారు. సామూహిక కుంకుమ పూజలు జరిపారు.

దాలి నాయుడు మృతికి సంతాపం

ఏలూరు కార్పొరేషన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : సీపీఐ ఏలూరు ఏరియా సీనియర్ నాయకులు, ఏఐటియుసి నాయకులు చింతల దాలి నాయుడు (86) మృతికి సీపీఐ, ఏఐటియుసి నాయకులు, పలు ప్రజా సంఘాల నాయకులు తీవ్ర సంతాపం తెలిపారు. స్థానిక సత్రంపాడులోని ఎంఆర్‌సి కాలనీ వద్ద దాలి నాయుడు గృహం వద్ద ఆయన పార్థివ దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సి.హెచ్.కొత్తగూడెంలో నూతన చర్చి ప్రారంభం

చింతలపూడి, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతకాయల కొత్తగూడెంలో తిరుహృదయ దేవాలయాన్ని ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు శుక్రవారం ప్రారంభించారు. రాఘవాపురం విచారణలోని ఈ చర్చిలో ఆయన దివ్యబలి పూజ నిర్వహించి ప్రార్థన జరిపారు. పలువురిని ఆశీర్వదించారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో ఫాదర్ మరియజోజి, విచారణ గురువు నిట్టా తంబి పాల్గొన్నారు.

గిరిజన మత్స్యకారుల అభివృద్ధికి కృషి

బుట్టాయగూడెం, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీలోని గిరిజన మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే చిర్రి బాల రాజు పేర్కొన్నారు. మత్స్య శాఖ ఆధ్వర్యంలో సిద్ధం చేసిన 60 వేల వివిధ రకాల చేప పిల్లలను శ్రీగుబ్బల మంగమ్మ తల్లి జల్లేరు జలాశయంలో శుక్రవారం విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో చాలామంది గిరిజనులు చేపల వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని అటువంటివారికి ఉపాధిని కల్పించడం కోసం ప్రభుత్వమే ఉచితంగా జలాశయాల్లో చేప పిల్లలను వేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్, ఆర్డీవో ఎంవీ రమణ, తహసీల్దార్ పివి చలపతిరావు, సర్పంచ్‌లు కారం లక్ష్మి పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం

కుక్కునూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కుక్కునూరుకు చెందిన గరటం హరీష్ అనే ఆటోడ్రైవర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో కుక్కునూరుకు చెందిన ఫ్రెండ్స్ టాటా మ్యాజిక్ యూనియన్ తరఫున రూ.10,500లు హరీష్ కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు.ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు విజయరాజు, మల్లేశ్వరరావు, రహీమ్, రాంబాబు, పండు, ప్రవీణ్, నాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణపై అభయ దళం అవగాహన

ఏలూరు క్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్పీ కెపిఎస్ కిశోర్ ఆదేశాల మేరకు శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ ప్రదేశాల్లో అభయ వాహనం ద్వారా భద్రతపై అవగాహన కల్పించారు. ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావు, మహిళా ఎస్ఐ కాంతిప్రియల ఆధ్వర్యంలో రక్షక దళ సభ్యులు కళాశాలలు, హైస్కూళ్లలో ముఖ్యమైన ప్రాంతాల్లో గస్తీలు నిర్వహించారు. బాలికలు, మహిళలు, వృద్ధుల రక్షణ కోసం ఏర్పాటు చేసిన వాట్సాప్ (95503 51100) నంబర్‌కు సమాచారం అందిస్తే త్వరితగతిన సేవలు అందించనున్నట్టు తెలిపారు. అభయ మహిళా రక్షక దళ సభ్యులు అభయ వాహనం ద్వారా వివిధ ప్రాంతాలలో తిరుగుతూ సైబర్ నేరాల నివారణ కొరకు జాబ్ ఫ్రాడ్స్, లోన్ ఫ్రాడ్స్, ఏపీకే యాప్‌ల ద్వారా జరిగే మోసాల గురించి ప్రజలకు దృశ్య రూపంలో వివరించిన అభయ రక్షక మహిళా దళ సభ్యులు సోషల్ మీడియా ద్వారా వెలువడే ముప్పులపై అవగాహన కల్పించారు.

ఉన్నతంగా ఎదగండి

విద్యార్థులకు ప్రముఖుల సూచనలు - జిల్లా వ్యాప్తంగా జాతీయ బాలికల దినోత్సవం

ఏలూరు క్రైం, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : విద్యతో పాటు ఆహారం, ఆరోగ్యం, సంరక్షణ పైన విద్యార్థులకు అవగాహన కల్పించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అన్నారు. జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా డిఎల్ఎస్ఎ భవనంలో బాలిక సంరక్షణ, పోషణ విద్య అనే అంశాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈసందర్భంగా రత్న ప్రసాద్ మాట్లాడుతూ బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థను నివారించడానికి అంతా భాగస్వామ్యం కావాలన్నారు.

ఏలూరు నగరంలోని విద్యా సంస్థల్లో...

ఏలూరు అర్బన్ : జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమాలు శుక్రవారం నగరంలోని పలు విద్యాసంస్థల్లో నిర్వహించారు. సీఆర్ఆర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సమాజంలో బాలికలు, మహిళలపై జరిగే నేరాలు,సామాజిక మాధ్యమాల ప్రభావం గురించి మాట్లాడిన మహిళా పోలీసుస్టేషన్ ఎస్సై వి.కాంతిప్రియను సత్కరించారు. డీసీపీవో సూర్య చక్రవేణి, ఉమెన్స్ సెల్ కో-ఆర్డినేటర్ లావణ్య, కరస్పాండెంట్ డాక్టర్ విష్ణుమోహన్, ప్రిన్సిపాల్ రామరాజు తదితరులు పాల్గొన్నారు. కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.ఆర్.కావ్యశ్రీ మాట్లాడుతూ బాలికల ప్రగతికిఉన్న అవకాశాల గురించి వివరించారు.

దెందులూరులో అవగాహనా ర్యాలీ...

దెందులూరు : మహిళలు ఏ విషయంలోనూ తక్కువ కాదని క్రమ శిక్షణతో చదివితే ఉన్నత స్థానాలకు చేరవచ్చని దెందులూరు బాలికోన్నత పాఠశాల హెచ్ఎం శ్రీదేవి, అంగన్వాడీ సెక్టార్ సూపర్‌వైజర్ చిట్టమ్మ అన్నారు. శుక్రవారం దెందులూరు బస్టాండ్ సెంటర్‌లోని బాలికోన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బాలికలతో కలిసి అంగన్వాడీ టీచర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు రంగమ్మ, సుజాత ధనలక్ష్మి పాల్గొన్నారు.

జాలిపూడిలో అవగాహనా ర్యాలీ...

ఏలూరు కార్పొరేషన్ : జాలిపూడిలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సత్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. ముందుగా బేటీ పడావో - బేటీ బచావో అంటూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ ఆరోగ్య కార్యదర్శి జయ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బ్రహ్మాజీ, అంగన్‌వాడీ టీచర్ సి.హెచ్.అనంతలక్ష్మి పాల్గొన్నారు.



జాలిపూడిలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

పెదవేగి జడ్పీ ఉన్నత పాఠశాలలో

పెదవేగి : బాలికల సమగ్రాభివృద్ధికి అనువుగా ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందని అంగన్‌వాడీ పెదవేగి సెక్టారు సూపర్‌వైజర్ సి.హెచ్.పార్వతి అన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని పెదవేగిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాలికల ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. పార్వతి మాట్లాడుతూ బాలికల సమగ్రాభివృద్ధికి కేంద్రం గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ మిషన్ పేరుతో కేంద్రం ఏర్పాటు చేసిన కార్యక్రమం ద్వారా బాలికల సంపూర్ణ ఎదుగుదల కోసం అనేక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. దీనిలో భాగంగా ఏటా జాతీయ బాలికా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా బాలికల అభ్యున్నతికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమాజంలో బాలికల సంరక్షణ, ఆరోగ్యం, హక్కులు, విద్య, సామాజిక ఎదుగుదల వంటి అంశాలపై అవగాహన కల్పించారు..

సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తా : ఎస్పీ

ఏలూరు క్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : సిబ్బంది సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తానని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ హామీ ఇచ్చారు. జిల్లాలో పనిచేస్తున్న సివిల్ పోలీసులు, ఏఆర్ పోలీసులు. హోంగార్డు తమ సమస్యలను శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ సిబ్బంది సంక్షేమ దివస్ కార్యక్రమంలో ఎస్పీకి విన్నవించారు. త్వరితగతిన పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. పోలీసు కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బంది ఇచ్చిన అర్జీని పరిశీలిస్తున్న ఎస్పీ కిశోర్

పశుపోషణకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం : చింతమనేని

పెదవేగి, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : రైతుల ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం పశుపోషణకు అధిక ప్రాధాన్యం ఇస్తూ ప్రోత్సహిస్తోందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పేర్కొన్నారు. పెదవేగి మండలం పెదకడిమిలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఆయన లేగ దూడల అందాల పోటీలను పరిశీలించారు. ఈ పోటీల్లో ఎంపికైన లేగ దూడలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆర్థికంగా ఎదిగితేనే సమాజం బాగుంటుందని, ఆ దిశగా రైతులను ప్రోత్సహించడానికి అనువుగా ప్రభుత్వం పశు పోషణకు ప్రోత్సాహకాలు అందిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్థక శాఖ సంయుక్త సంచాలకుడు డాక్టర్ గోవింద రాజులు, సహాయ సంచాలకుడు డాక్టర్ మోహన్ బాబు, ఎంపీడీవో పి.శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ కొసరాజు బలరామకృష్ణ చౌదరి, ఎంపీటీసీ సభ్యుడు చల్లగొళ్ళ గోపాలకృష్ణ, నీటి సంఘం అధ్యక్షుడు ఉండవల్లి వెంకటేశ్వరరావు, కొప్పాక సర్పంచ్ పరాశరం భాస్కర దీక్షితులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



పశు వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

చిన్నగురవాయిగూడెంలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

టి.నరసాపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, మాజీ జడ్పీటీసీ సభ్యులు నల్లూరి వెంకట చలపతిరావు అన్నారు. చిన్నగుర్వాయిగూడెం ఎంపీపీ పాఠశాల, టి.నరసాపురం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ పుట్టిన రోజు వేడుకలు చలపతిరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. చిన్నగుర్వాయిగూడెం ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేసి పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా విద్యనభ్యసించి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించటానికి కృషి చేస్తానని అన్నారు. 10వ తరగతి విద్యార్థులను ప్రోత్సహించటానికి పబ్లిక్ పరీక్షల్లో మండలంలో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థికి 20వేల రూపాయలు, రెండవ ర్యాంక్ సాధించిన విద్యార్థికి 10వేల రూపాయలు నగదు ఇస్తానని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పిన్నమనేని మధు, పవన్, దావులూరి కృష్ణ, కొండపల్లి రవి, బలుసు రవి తదితరులు పాల్గొన్నారు.



చిన్నగురవాయిగూడెంలో పుస్తకాల పంపిణీ దృశ్యం



చింతలపూడి ఏరియా ఆస్పత్రి వద్ద ఆందోళన



దెందులూరు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిరసన

'బకాయి పడిన జీతాలు చెల్లించండి'

దెందులూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): దెందులూరు ప్రభుత్వ ఆసుపత్రిలో శానిటేషన్ పనులు చేసే తమకు బకాయి జీతాలు, పీఎఫ్ నిధులు చెల్లించాలని ఉద్యోగులు నిరసనకు దిగారు. ఈ మేరకు దెందులూరు ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రి ముందు ఆందోళన చేపట్టారు. బకాయిల చెల్లిస్తేనే తప్ప పనులు చేయలేమని భీష్మించుకు కూర్చున్నారు. దెందులూరు మండల శానిటేషన్ కార్మికుల సంఘం మండలాధ్యక్షుడు పి.అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరసన చేపట్టారు. వీరికి ఏఐటీయూసీ ప్రెసిడెంట్ కృష్ణమాచార్యులు, కార్యదర్శి దత్తాత్రేయ మద్దతు తెలిపారు.

కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం వద్దు...

ఏలూరు : జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో పనిచేసే పారిశుధ్య, సెక్యూరిటీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ మెడికల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం సమ్మె చేపట్టారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తమ విధులను విడిచిపెట్టి నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంచె వసంత రావు, ఆసుపత్రి యూనియన్ నాయకుడు వేముల రాజు, మేరీ, దయామణి, చంద్రకళ, ప్రభావతి, దుర్గారావు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రి వద్ద సమ్మె...

చింతలపూడి : స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులు శుక్రవారం నుంచి తమ సమస్యలు పరిష్కారం కాలేదంటూ సమ్మెలోకి దిగారు. గురువారం ఆసుపత్రి వద్ద బైఠాయించి నినాదాలు చేశారు. ఏఐటియుసి జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి టి.బాబు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమ్మెలో కార్మిక నాయకులు టి.మరియమ్మ, శ్రీనివాసరాజు, వాణి, దేవమణి, తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి...

బుట్టాయగూడెం :పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలు చెల్లించాలంటూ బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు శుక్రవారం ఆందోళన చేశారు. కార్మికుల ఆందోళనకు కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ మద్దతు తెలిపారు. ఫ్రాన్సిస్ మాట్లాడుతూ సిహెచ్‌సిలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు అండగా ఉంటా

ఏలూరు టూటౌన్, జనవరి24(ఆంధ్రజ్యోతి) : మహిళలకు అన్ని విధాలుగా తమ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం మోసపూరిత పథకాలతో మహిళల్ని మభ్యపెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం మహిళలకు ఆర్థిక పరిపుష్టి కల్పించేందుకు కృషి చేస్తుందన్నారు. మహిళలకు భవిష్యత్తుపై భరోసా కల్పిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని ఎవరికి ఎటువంటి సమస్యలున్నప్పటికీ వెంటనే తనను కలవాలని ఎమ్మెల్యే అన్నారు. సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తానని అన్నారు. కార్యక్రమంలో చల్లా సత్యవరప్రసాద్, రెడ్డిబోయి శివప్రసాద్, నెరుసు గంగరాజు, పాల్గొన్నారు.

బ్యాంకు లావాదేవీలపై అవగాహన

భీమడోలు, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ బ్యాంకింగ్ లావాదేవీల పట్ల అవగాహన కలిగి ఉండాలని జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ డి.నీలాద్రి అన్నారు. శుక్రవారం స్థానిక గీతాంజలి జూనియర్, డిగ్రీ కళాశాల ఆవరణలో ఆర్‌బిఐ డిపాజిటర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన నీలాద్రి మాట్లాడుతూ సైబర్ క్రైం పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని టోల్ ఫ్రీనెం 1930పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. అపరిచరితుల వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్, మోసపూరిత ఈ మెయిల్స్ పట్ల జాగ్రత్త వహించాలని కోరారు. అనంతరం ప్రధాన మంత్రి బీమాయోజన పథకాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి పౌరుడు కు బ్యాంకింగ్ అకౌంట్ కల్గి ఆర్థిక అక్షరాస్యత సాధించాలని బ్యాంకింగ్ సేవలు అప్రమత్తతతో ఉపయోగించుకోవాలన్నారు.

ఓటర్ల దినోత్సవ పోటీల విజేతలు వీరే

ఏలూరు అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్కూల్ విద్యార్థులకు జిల్లా స్థాయిలో శుక్రవారం స్థానిక సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూల్లో నిర్వహించిన వక్తృత్వం, వ్యాస రచన పోటీల విజేతల జాబితాను డీఈవో వెంకటలక్ష్మమ్మ ప్రకటించారు. వక్తృత్వంలో పెదపాడు బీ.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని కె.శృతి, ఏలూరు శర్వాణీ స్కూల్ విద్యార్థిని జి.ఎస్.శ్రీదీపిక, ఉంగుటూరు మండలం నారాయణపురం జడ్పీ హైస్కూలు విద్యార్థిని జి.హర్షప్రియ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వ్యాస రచనలో నారాయణపురం జడ్పీ హైస్కూలు విద్యార్థిని జి.కావ్యశ్రీ, ఏలూరు సుబ్బమ్మదేవి స్కూలు విద్యార్థిని ఐ.రేణుక సాయి తనూజ, జంగారెడ్డిగూడెం జడ్పీ బాలుర హైస్కూలు విద్యార్థిని కె.కీర్తన తొలి మూడు స్థానాల్లో నిలిచారు. వీరందరికీ శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించే ఓటర్ల దినోత్సవంలో బహుమతులు అందజేస్తామని వివరించారు.

పీసా గ్రామ సభలకు ఏకగ్రీవ ఎన్నిక

బుట్టాయగూడెం, జనవరి(ఆంధ్రజ్యోతి) : మండలంలోని లక్ష్మిణుడిగూడెం, కొమ్ముగూడెం, చింతలగూడెం, నిమ్మలగూడెం గ్రామాల్లో శుక్రవారం జరిగిన పీసా గ్రామ సభలకు ఉపాధ్య, కార్యదర్శుల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్లు ఎంపిడివో కె.జ్యోతి తెలిపారు. గతంలో వివిధ కారణాలు వలన ఎన్నిక ఆగిపోగా తిరిగి అధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం జరిపించారు. పులిరాముడుగూడెం, ముద్దప్పగూడెం గ్రామాల్లో కోరం లేకపోవడంతో ఉపాధ్య, కార్యదర్శుల ఎన్నిక నిలిచిపోయినట్లు తెలిపారు.

దోమలను నిర్మూలించేందుకు డ్రైడే పాటించండి

ఏలూరు అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రాణాంతక వ్యాధులను వ్యాపింపజేయడంలో దోమ ప్రధానపాత్ర పోషిస్తోందని, దోమలను శత్రువులుగా భావించి వాటి నిర్మూలనలో ప్రజలు భాగస్వాములు కావాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ప్రసాద్ సూచించారు. స్థానిక తాపీమేస్త్రీ కాలనీ, లంకపేట పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలోని వీధుల్లో శుక్రవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ శుక్రవారం డ్రైడేగా పాటించి, ఇంట్లోఉండే మంచినీటి నిల్వప్రాంతాలను పొడిగా ఉంచాలని కోరారు.

సూర్య స్కూలుకు కీడాపోటీల ఛాంపియన్‌షిప్

ఏలూరు అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(అపుస్మా) స్పోర్ట్స్ గేమ్స్ మీట్ ఘనంగా జరిగింది. ఏలూరు జోన్ ఆధ్వర్యంలో ఏఎస్ఆర్ స్టేడియంలో బుధ, గురు వారాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో తంగెళ్ళమూడి శ్రీసూర్య స్కూల్ ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచిందని స్కూలు డైరెక్టర్ కె.చంద్రశేఖర రావు ఓ ప్రకటనలో తెలిపారు. విజేతలను అభినందించారు.

బోసుబొమ్మ సెంటర్‌లో ట్రాఫిక్ ఐలాండ్

చింతలపూడి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి బోసుబొమ్మ సెంటర్‌లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ట్రాఫిక్ ఐలాండ్ నిర్మాణాన్ని శుక్రవారం చేపట్టారు. చింతలపూడి సిఐ రవీంద్ర పనులు పరిశీలిస్తూ మాట్లాడారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో ఈ ట్రాఫిక్ ఐలాండ్ ఏర్పాటు చేస్తున్నామని, అంతేకాక పట్టణంలోని దుకాణాలు, అపార్టుమెంట్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని స్థానికులతో సమావేశమయ్యి చెప్పామని, 15 రోజుల్లో వీటిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోండి

బుట్టాయగూడెం, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : బుట్టాయగూడెం పరిసర ప్రాంతాల్లో చేపట్టిన అక్రమ కట్టడాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు బుట్టాయ గూడెం కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. పంట పొలాల్లోను, కాలువలు పూడ్చి ఇళ్ళు, షాపులు నిర్మిస్తున్నారని సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ తెలిపారు. అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.

'రాష్ట్ర ప్రభుత్వం చేనేతను ఆదుకోవాలి'

ఏలూరు రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేనేతకు రూ.2 వేల కోట్లు కేటాయించడమే కాకుండా జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలని ఏపీ చేనేత కార్మిక సంఘం ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శనివారపుపేట వీవర్స్ కాలనీలో శుక్రవారం చేనేత కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం చేనేత, జౌళి శాఖ అధికారికి బి.హనుమంతురావును కలిసి జిల్లా కార్యదర్శి ఆదిశేషు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయం తరువాత చేనేత ప్రధాన వృత్తిగా ప్రసిద్ధి చెం దిన చేనేత పరిశ్రమ కార్పొరేట్ విధానాల వల్ల సంక్షోభంలో చిక్కు కుందని, కార్మికులు ఉపాధిని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

వైకల్యం నివారణ పై అవగాహన

ఏలూరు రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు రూరల్ మండలం చాటపర్రులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో దివ్యాంగుల హక్కుల చట్టం, వైకల్యం, నివారణ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆ పాఠశాల హెచ్‌ఎమ్ విజయ్ కుమారి పాల్గొని గోడపత్రికను ఆవిష్కరించారు. జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం సిబ్బంది మాట్లాడుతూ వైకల్య నివారణకు ముందుగా తీసుకువాల్సిన జాగ్రత్తలు గుర్తింపు, వైకల్యం వచ్చిన తరువాత ఏ విధంగా ఎదుర్కోవాలనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం ప్రత్యేక హక్కులను కల్పించిందని, వాటిని తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు దివ్యాంగుల పునరావాసకేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగించుకోవాలి



బి.కిరణ్, ఉద్యానవన శాఖ అధికారి, దెందులూరు

- **ఉద్యాన పంటలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలేంటి?**

జవాబు : గతంలో పామాయిల్ మొక్కకు 193 రూపాయలు ఇచ్చేవారు. ఇప్పుడు మొక్కలను ఉచితంగా అందిస్తున్నాం. రైతులు పాస్ బుక్, ఆధార్, బ్యాంకు ఖాతా అందించాలి.

- **పామాయిల్ తోటలో అంతర పంటల పరిస్థితి ఏమిటి?**

జవాబు : రైతులు అంతర పంటలు వేస్తే ప్రభుత్వం ఏడాదికి రూ.5 వేల 250 అందిస్తోంది. ఎరువులకు సబ్సిడీ అందిస్తోంది. గెలలు కోసేందుకు ఉచితంగా పనిముట్లు అందిస్తున్నాం. వర్మి కంపోస్టు యూనిట్ పెట్టుకుంటే రూ.15 వేలు అందిస్తాం.

- **నిమ్మ, బత్తాయి, అరటి బొప్పాయిలకు సబ్సిడీ ఉందా?**

జవాబు : ఈ ప్రభుత్వం ఉద్యాన రైతులను ఆదుకునేందుకు నిమ్మ, బత్తాయి రైతులకు మొదటి ఏడాది రూ.30 వేలు, రెండవ ఏడాది 20 వేలు, పచ్చి అరటి రైతులకు రెండు సంవత్సరాలకు రూ. 60 వేలు, బొప్పాయి పంటకు రెండు సంవత్సరాలకు 30 వేలు అందిస్తాం.

- **రైతులకు ట్రాక్టర్లు అందిస్తున్నారా?**

జవాబు : రైతులకు సబ్సిడీపై చిన్న ట్రాక్టర్లకు లక్షా 60 వేల రూపాయలు అందిస్తున్నాం. పండిన పంటను నిల్వ చేసుకునేందుకు చిన్న గొడౌన్‌కు రూ.12 లక్షలు, పెద్ద గొడౌన్‌కు మిషన్‌లతో సహా రూ.56 లక్షలు అందిస్తున్నాం.

- **కోకో పంటకు సబ్సిడీ ఉందా?**

జవాబు : రైతులు కోకో మొక్కలు కొనుగోలు చేసి బిల్లులు అందిస్తే వారికి ఎరువుల నిమిత్తం రెండు సంవత్సరాలకు గానూ రూ.30 వేల రూపాయలు అందిస్తున్నాం.

- **పంటలకు డ్రిప్ వేస్తే సబ్సిడీ అందిస్తున్నారా?**

జవాబు : ఐదెకరాలలోపు రైతులకు 90 శాతం సబ్సిడీ అందిస్తున్నాం. దాటిన పెద్ద రైతులకు 50 శాతంతో సబ్సిడీని అందిస్తున్నాం. మందులు పిచికారీ చేసుకునే యంత్రాలకు రూ.8 వేల రూపాయల సబ్సిడీ అందిస్తున్నాం.

- దెందులూరు

ట్రంప్ ఫాసిస్టు విధానాలపై అసహనం

జంగారెడ్డిగూడెం, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా కామ్రేడ్ లెనిన్ వారసత్వాన్ని కొనసాగిద్దామని సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కె.జి.రామచంద్రన్ పిలుపునిచ్చారు. స్థానిక రోటరీ క్లబ్ భవనంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ లెనిన్ శత వర్ధంతి ముగింపు సభ సిరికొండ రామారావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కె.రామ, ఎస్.కె.గౌస్‌జి, ముత్యాలరావు పాల్గొన్నారు.

పోలవరంలో పాఠశాలల రికార్డుల పరిశీలన

పోలవరం, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : పోలవరం మండలంలో పాఠశాలల రికార్డులను మండల ప్రత్యేకాధికారి వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ జి.సి.హెచ్.ప్రభాకర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ మండలంలో వివిధ పాఠశాల్లో విద్యార్థుల సంఖ్య, ఆన్‌లైన్‌లో ఉన్న సంఖ్య వివరాలు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పరిశీలించి నివేదిక పంపినట్టు తెలిపారు.

గజేంద్రమ్మ మృతికి సంతాపం

కామవరపుకోట, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : కామవరపు కోట సీపీఐ మండల కార్యదర్శి టి.వి.ఎస్.రాజు తల్లి తాటిగడప గజేంద్రమ్మ మృతికి నివాళులర్పిస్తూ సీపీఐ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం సంతాప సభ నిర్వహించారు. గజేంద్రమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏలూరు జిల్లా నాయకులు పాల్గొని నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు.

కారుకు అడ్డు వచ్చాడని మోటార్ సైక్లిస్టుపై దాడి

ఆస్పత్రిపాలైన బాధితుడు

ఏలూరు క్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మోటార్ సైకిలిస్టు అడ్డువచ్చాడని కారులో ఉన్న వ్యక్తి ఆగ్రహించి ఇనుప రాడ్డుతో దాడికి పాల్పడిన ఘటన సంచలనంగా మారింది. ఈ దాడిలో మోటారు సైకిలిస్టు తీవ్ర గాయాలపాలయ్యాడు. ఏలూరు సమీపంలోని సత్రంపాడుకు చెందిన ఎం.సాయి కుమార్ ఏలూరులో ఐస్‌క్రీం పార్లర్ నిర్వహిస్తున్నాడు. శుక్రవారం ఉదయం తన మోటారు సైకిల్ పై శనివారపుపేట నుంచి జన్మభూమి పార్కు వైపు వెళ్తుండగా అంతలో ఎదురుగా డిస్ట్రిక్ట్ జడ్జి అనే బోర్డు కలిగిన కారు(ఎపి39డిబి 799) ఎదురుగా వచ్చింది. కారుకు మోటారు సైకిల్ అడ్డురావడంతో ఇరువురు ఘర్షణ పడ్డారు. కారులోని వ్యక్తి ఆగ్రహంతో రాడ్డుతో దాడి చేయడంతో సాయికుమార్ తీవ్రంగా గాయపడ్డాడు.. దీంతో బాధితుడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఈ సంఘటనపై త్రిటౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



ప్రత్తిపాడు స్టేజీ వద్ద అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న పిట్టల వాళ్ల గుడిసెలు

పిట్టలోళ్ల గుడిసెలు దగ్ధం

- బైరవపట్నం సమీపంలో ప్రత్తిపాడు స్టేజీ వద్ద ఘటన
- పది మందికి గాయాలు.. అందులో ఆరుగురి పరిస్థితి విషమం

మండవల్లి, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : మండవల్లి మండలం భైరవపట్నం సమీపంలోని ప్రత్తిపాడు స్టేజీ వద్ద నివాసముంటున్న పిట్టలోళ్ల గుడిసెలు ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగి సుమారు 20 చిన్నపాటి గుడిసెలు శుక్రవారం రాత్రి దగ్ధమయ్యాయి. చేపల చెరువుపై పిట్టలు వాలకుండా కాపలాకు పొరుగు ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 25 కుటుంబాల వారు ప్రత్తిపాడు స్టేజి సెంటరులో తాత్కాలిక గుడిసెలు ఏర్పాటు చేసుకుని నివశిస్తున్నారు. శుక్రవారం రాత్రి ఆ గుడిసెలలో దోమల నివారణకు వెలిగించిన నిప్పు ప్రమాదానికి కారణమైందని భావిస్తున్నారు. పిట్టల కాపలా కోసం వినియోగించే గన్‌లో మందుకు నిప్పు అంటు కోవడంతో ఈ ప్రమాదం సంబవించిందని భావిస్తున్నారు. ఒక్కసారిగా గుడిసెలో పేలు డు శబ్దం విన్పించి మంటలు చెలరేగినట్టు స్థానికులు తెలిపారు. సుమారు పది మంది వరకు గాయాలతో కైకలూరు ఆసుపత్రికి తరలించారు. వారిలో ఆరుగురి పరిస్థితి విష మంగా ఉందని సమాచారం. వీరిలో నలుగు రు పురుషులు, ఒక మహిళ, రెండేళ్ల బాలుడు ఉన్నారు. అగ్నిప్రమాద కేంద్రానికి సమాచారం ఇచ్చినప్పటికి అందుబాటులో వాహనం లేకపోవడంతో గుడిసెలు పూర్తిగా మంటల్లో కాలిపోయాయి. గుడిసెల్లో నిద్రపోతున్న వారు రోడ్డుపైకి పరుగులు తీసుకుంటూ వచ్చేశారు.



మంచినీటి ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న ముస్లిం మత పెద్ద ముఫ్తీ, తదితరులు

బుడా సాహెబ్ ట్రస్టు సేవలు అభినందనీయం

కైకలూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బుడా సాహెబ్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని ముస్లిం మత పెద్ద ఎండీ ముఫ్తీ అన్నారు. శుక్రవారం కైకలూరు పెద్ద మసీదు వద్ద బుడాసాహెబ్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకర్‌ను ఆయన ప్రారంభించారు. రానున్న వేసవి దృష్ట్యా తాగు నీటి సమస్యను పరిష్కరించేందుకు వాటర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎండీ గాలీబ్‌బాబు, మాజీ వైస్ ఎంపీపీ ఎంఏ రహీం, ముస్లిం నాయకులు ఎండీ జానీ, సయ్యద్ అమీర్, సయ్యద్ బాషీద్, ఎండీ జహీర్, అబ్దుల్ మున్నా, కలిదిండి రెహమాన్ పాల్గొన్నారు.



నితీష్ కుమార్‌ను సత్కరిస్తున్న సిబ్బంది

ఆర్జీయూకేటీకి ప్రత్యేక నిధులు విడుదల

నూజివీడు టౌన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : రాజీవ్ గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ నూజివీడు క్యాంపస్‌కు నిధి స్కీమ్ నిధులను మంజూరు చేసినట్లు ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఎస్. అమరేంద్రకుమార్ తెలిపారు. శుక్రవారం విలేఖర్లతో మాట్లాడుతూ నూజివీడు డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ డైరెక్టర్ డి.ఐ.సి జేఎన్‌టీయూ కాకినాడ ద్వారా కేంద్ర విద్యాశాఖను సంప్రదించగా నిధి స్కీమ్ నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. స్కీమ్ ప్రతినిధి నితీష్ కుమార్‌ను శుక్రవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధిస్కీమ్ ద్వారా 2025 టెక్‌జిట్‌లో నిర్వహిస్తున్న ప్రాజెక్టు ఎక్స్ పోకు కావాల్సిన నిధులు సమకూరినట్లు అయిందని ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ తెలిపారు. ట్రిపుల్ ఐటీ ఏవో బి.లక్ష్మణ్, సీఏవో బి.ప్రసాద్, డాక్టర్ చిరంజీవి, ఈసీఈ ఫ్యాకల్టీ రియాజ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



కంప్యూటర్లను ప్రారంభిస్తున్న దృశ్యం

పాఠశాలకు కంప్యూటర్ల వితరణ

నూజివీడు టౌన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): నూజివీడు మండలం పోతురెడ్డిపల్లి ఎంపీపీ పాఠశాలకు ఐడీబీఐ బ్యాంకు ఆధ్వర్యంలో లక్షా 25 వేల రూపాయలు విలువ చేసే నాలుగు కంప్యూటర్లను బహూకరించారు. గ్రామ సర్పంచ్ తగరం సుజాత, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కొమ్ము విజయ్‌కుమార్, కొమ్మన నాగేశ్వరరావు, చలసాని వెంకట రామారావు, మాజీ సర్పంచ్ అక్కినేని చందు, బెనర్జీ పాల్గొన్నారు.

బూరుగ్గూడెంలో ఉచిత పశు వైద్యం

చాట్రాయి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరుగ్గూడెంలో మండల పశువైద్యాధికారి శివ నాగేంద్ర బాబు ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. 120 గేదెలు ఆవులు, 320 మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు, 500 గొర్రెలు మేకలకు వ్యాక్సినేషన్, 14 గేదెలకు చూడి పరీక్షలు, 32 దూడలకు డీవార్మింగ్ చేసినట్లు ఆయన తెలిపారు.



బూరుగ్గూడెంలో ఉచితంగా దాణా పంపిణీ

తోటపల్లిలో ఎఫ్ఎల్ఎన్ శిక్షణ

ఆగిరిపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి మండలంలోని తోటపల్లి గ్రామంలో హీల్ ప్యారడైజ్ స్కూల్లో ఎఫ్ఎల్ఎన్ జ్ఞానప్రకాష్ 60 రోజుల సర్టిఫికెట్ కోర్సు శిక్షణ ఆగిరిపల్లి మండల విద్యాశాఖ అధికారి కొవ్వలి ఆనంద్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల నుంచి వచ్చే పిల్లలందర్ని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్చాలని సూచించారు. కె.హరికృష్ణ, ఎస్.శ్రీరామ్, అంకం వెంకటేశ్వరరావు, ఎం.లక్ష్మణ్, ఏఎంవో రెడ్డిరామారావు, వివిధ మండలాల ఉపాధ్యాయులు హాజరయ్యారు.



శిక్షణ ఇస్తున్న అధికారులు



చాట్రాయి మండలం తుమ్మగూడెంలో జాతీయ బాలికా దినోత్సవం



ఆగిరిపల్లిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ సూపర్ వైజర్ రాగమయి

ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం

కైకలూరు/ముదినేపల్లి/కలిదిండి/మండవల్లి/ఆగిరిపల్లి / ముసునూరు/చాట్రాయి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): బాలికల హక్కులను పరిరక్షించుకోవాలని ఐసీడీఎస్ అధికారిణి వి. దీప్తి అన్నారు. శుక్రవారం కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, డిబేట్ నిర్వహించారు. అనంతరం కైకలూరులో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని వివరించడంతో పాటు బాలల హక్కులను, న్యూట్రిషన్ ఫుడ్‌పై వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎల్. లావణ్య, వి.కృష్ణకుమారి, హెచ్ఎం ఎం.ముబీనాబాను, మహిళా పోలీసు సన్నూతి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ముదినేపల్లి మండలం ముదినేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం స్త్రీ శిశు సంక్షేమ శాఖ బాల్య వివాహాల నివారణపై అవగాహన సదస్సు ముదినేపల్లి మండల ప్రత్యేకాధికారి పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. తహసీల్దార్ సుభాని, ఎంపీడీవో వై.రామకృష్ణ, ఎంఈవో నరేష్‌కుమార్, హైస్కూలు హెచ్ఎం విజయకుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఝాన్సీ మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు. బొమ్మినంపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్ఎం శ్రీలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసూన, ఎంపీటీసీ దాసరి అరుణకుమారి, పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కలిదిండి మండలం కలిదిండి జడ్పీ హైస్కూల్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కిశోర బాలికలు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాలికలకు వ్యాసరచన, డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ కరుణకుమారి, ఎంపీటీసీలు సుమన్, చాన్ బాషా, ఎస్ఐ వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. మండవల్లి మండలం మండవల్లి జడ్పీ హైస్కూల్లో కిశోర బాలికలకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఐసీడీఎస్ కైకలూరు ప్రాజెక్టు అధికారిని వి.దీప్తి ఆధ్వర్యంలో కిశోర బాలికలకు, శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం విజేతలకు ఎంపీడీవో రామలింగేశ్వరరావు, ఎంఈవో రత్న సునందం బహుమతులు అందజేశారు. ఆగిరిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ జి.రాగమయి బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికను రక్షిద్దాం.. బాలికను చదివిద్దాంలో భాగంగా బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. హైస్కూల్ హెచ్ఎం పుష్పలత, ఎం.ఎస్.కె రాణి, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ముసునూరు మండలం రమణక్కపేట హైస్కూల్‌లో బాలికల హక్కులు, చట్టాలు, విద్య ఆరోగ్యం, భరోసా తదితర వాటిపై హెచ్ఎం రామ కృష్ణారావు అవ గాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు.బాలికలకు వివిధ ఆటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులందజేశారు. ఇంటి దీపం, మమతకు ప్రతిరూపం ఆడపిల్లే అని హెచ్ఎం గంపా వెంకట్రావు అన్నారు. మండలంలోని తుమ్మగూడెం ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆడ పిల్లలు చదుకుంటేనే మగవారితో సమాన స్థాయికి ఎదగగలరని, సమాజంలో ఆడపల్లలకు ఎదురవుతున్న అడ్డంకులను ధైర్యంతో ఎదుర్కొని ముందడుగు వేయాలని ఉద్బోదించారు. ఎస్ఎంసీ చైర్మన్ హసీనా పాల్గొన్నారు.



కైకలూరులో ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు, విద్యార్థినులు



మండవల్లి హైస్కూల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పర్మినెంట్ అధికారులను నియమించాలి : ఎంపీపీ

కలిదిండి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఇన్‌చార్జి మండలస్థాయి అధికారులతో అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని పర్మినెంట్ అధికారులను నియమించాలని ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు కోటి 50 లక్షల నిధులు కేటాయించామని, ఫిబ్రవరి నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. కలిదిండి, కోరుకొల్లు, మూల్లంక పీహెచ్‌సీల్లో మౌలిక సదుపాయాలకు రూ.9లక్షలు మంజూరు చేశామన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది కొరతతో అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతుందన్నారు. రెవెన్యూ, విద్యాశాఖలో సిబ్బంది కొరత ఉందన్నారు. కాల్వల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూడును తొలగించి సాగునీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జడ్పీటీసీ సభ్యులు బొర్రా సత్యవతి, వైస్ ఎంపీపీ కనకదుర్గారాణి, ఎంపీడీవో కొండలరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ ఉమామహేశ్వరరావు

భూ సేకరణ వేగవంతం చేయండి : సబ్ కలెక్టర్

ముసునూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రమణక్కపేటలో కుమ్మవారి బజారులో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి త్వరితగతిన భూసేకరణ చేయాలని నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించి భూసేకరణపై అధికారులతో సమీక్షించారు. వర్షాకాలంలో వర్షపునీరు, వాడే నీరు సైతం బయటకు వెళ్ళే పరిస్థితి లేదని, దీంతో నివాస గృహాలు ముంపుకు గురవుతున్నాయని, రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో ఇళ్ళు నానిపోయి కూలిపోయే పరిస్థితులు నెలకొన్నా యని స్థానికులు సబ్ కలెక్టర్‌కు వివరించారు. దీర్ఘకాలంగా ఉన్న ఈ డ్రైనేజీ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని సబ్ కలెక్టర్ తెలిపారు. ఈవోపీఆర్డీ సత్యనారాయణ, కార్యాదర్శి నాగబాబు, మండల సర్వేయర్ సురేష్ బాబు, జనసేన, టీడీపీ నాయకులు పాశం నాగబాబు, రంగు వాసు తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీని పరిశీలిస్తున్న అధికారులు

కాళ్లపాలెంలో డాక్టర్ నరసింహారావు విగ్రహావిష్కరణ

కలిదిండి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కాళ్లపాలెంలో కాళ్లపాలెం డాక్టర్‌గా పేరొందిన బత్తిన నరసింహారావు విగ్రహాన్ని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి లాభాపేక్ష లేకుండా నియోజకవర్గంలో పేదలకు ఉచిత వైద్య సేవలందించిన డాక్టర్ బత్తిన నరసింహారావు చిరస్మరణీయుడని కొనియాడారు. డాక్టర్ విగ్రహాన్ని గ్రామస్థులు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు, టీడీపీ నాయకులు కొనకళ్ల బుల్లయ్య, కాళ్లపాలెం బుజ్జి, సర్పంచ్ పేటేటి స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.



కాళ్లపాలెంలో నరసింహారావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

పెండింగ్ జీతాలు విడుదల చేయాలి

నూజివీడు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న జీతాలను, పీఎఫ్‌లను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఏఐటీయూసీ అనుబంధ ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నూజివీడు ఏరియా ఆసుపత్రి గేటు వద్ద నిరసన చేపట్టారు. నూజివీడు నియోజకవర్గ ఏఐటీయూసీ కార్యదర్శి చాట్లపుల్లారావు మాట్లాడుతూ కార్మికులకు గుత్తేదారులు సకాలంలో జీతాలు ఇవ్వడం లేదన్నారు. మూడు నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉండటం వల్ల కార్మికులు కుటుంబపోషణ కష్టంగా ఉందన్నారు. గుత్తేదారు వ్యవస్థను రద్దుచేసి పురపాలక కార్మికుల తరహాలో ఆప్కాస్‌లో కలపాలని విజ్ఞప్తి చేశారు. ఏరియా హాస్పిటల్ శానిటరీ కార్మికులు రమాదేవి, మణి, సత్యవతి, రషీదా తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు



భైరవపట్నంలో రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

సీసీరోడ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే కామినేని

మండవల్లి జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలం భైరవపట్నం గ్రామంలో నరేగా నిధుల ద్వారా మంజూరైన సీసీరోడ్లను, వాటర్ ఫిల్టర్‌బెడ్‌ను కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం చావలిపాడు గ్రామంలో నరేగా నిధులు ద్వారా మంజూరైన సీసీ రోడ్డును ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఎన్డీయే నాయకులు చాపరాల దుర్గాప్రసాద్, ముళ్లపూడి సత్తిబాబు, గాదిరాజు భాస్కర్‌వర్మ, సబ్జా బాబి, తదితరులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్‌కు మూడు నెలల జైలు శిక్ష

నూజివీడు టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వాహనాన్ని నిర్లక్ష్యంగా నడిపి, ఇద్దరు మృతికి కారణమైన వాహనచోదకునికి మూడునెలలు జైలుశిక్ష, రూ.200 జరిమానా విధిస్తూ శుక్రవారం నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి తీర్పు చెప్పారు. 2020, సెప్టెంబరు 26న బాపులపాడు మండలం కానుమోలుకు చెందిన దాసరి లెనిన్ ఆయన కుమార్తె వంజరపు శ్రీదేవిలు ద్విచక్రవాహనంపై మచిలీపట్నం వెళుతుండగా కానుమోలు శివారు లింగంచెరువు వద్ద లారీ వీరి ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా బలంగా ఢీ కొట్టింది. దీంతో లెనిన్, శ్రీదేవిలు తీవ్ర గాయాలపాలై సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. హనుమాన్ జంక్షన్ పోలీసులు కేసు నమోదు చేయగా, విచారణ అనంతరం న్యాయమూర్తి ఏలూరుకు చెందిన లారీ డ్రైవర్ నల్లా ప్రభాకర్‌కు మూడు నెలలు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

పాడి రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం

ముసునూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు చేయూతను అందించడమే ప్రభుత్వం లక్ష్యమని టీడీపీ నాయకులు లక్కపాము కాంతరావు, కాట్రు రామస్వామి అన్నారు. శుక్రువారం లోపూడి, బలివే గ్రామాల్లో జరిగిన ఉచితపశు వైద్యశిబిరాల్లో వైద్యాధికారి డాక్టర్ ఎం.చైతన్య పశువులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. 68 గేదేలకు గర్భకోశ వ్యాధి నివారణ మందు, 700 గొర్రెలు, 800 మేకలు, 88 దూడలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. రైతులు పాల్గొని తమ పశువులకు ఉచిత వైద్య పరీక్షలు చేయించారు.

ఇంటర్వ్యూ..

రోడ్డు భద్రతా వారోత్సవాలపై అవగాహన కల్పిస్తున్నాం

వి. రవికుమార్
కైకలూరు రూరల్, సీఐ



- రోడ్డు భద్రతా వారోత్సవాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతు న్నారా ?

జవాబు : గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం

- ఎన్‌హెచ్ ప్రమాదాలపై తీసుకుంటున్న చర్యలేవి ?

జవాబు : హైవేకి అనుసంధానమైన ప్రదేశాల్లో రేడియం స్టిక్కర్లతో డ్రమ్ములను ఏర్పాటు చేస్తున్నాం.

- కొల్లేటికోట సర్కారు కాల్వ వంతెనపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తీసుకుంటున్న చర్యలేవి ?

జవాబు : హైదరాబాద్ నుంచి సిగ్నలింగ్ ఏర్పాటు చేసే టెక్నీషియన్‌ను తీసుకొచ్చాం. వంతెను ఇరుకుగా ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలను బట్టి సిగ్నల్స్ పడే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

- హెల్మెట్ల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారా ?

జవాబు : కైకలూరులో హెల్మెట్లు ధరించి ప్రజలకు అవగాహన కలిగేలా ర్యాలీ చేపడుతున్నాం.

- ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్‌లను గుర్తించారా ?

జవాబు : ప్రమాదాల నివారణ కోసం మలుపుల వద్ద ఉన్న చెట్లను తొలగించడంతో పాటు గోతుల వద్ద రేడియం స్టిక్కర్లతో డ్రమ్ములను ఏర్పాటు చేస్తున్నాం.

(ఆంధ్రజ్యోతి-కైకలూరు)



పూడికతీత పనులను ప్రారంభిస్తున్న బలరామ్

పంట కాల్వలో పూడికతీత పనులు ప్రారంభం

కలిదిండి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కోరుకొల్లు పంట కాల్వలో పూడికతీత పనులను నీటి సంఘ అధ్యక్షుడు కేశిరెడ్డి బలరామ్ శుక్రవారం ప్రారంభించారు. కాంట్రాక్టరుతో మాట్లాడి సాగు, తాగునీరు కాల్వల్లో సక్రమంగా సరఫరా అయ్యే విధంగా పంట కాల్వలో పూడికతీత పనులు చేపట్టామన్నారు. నీటి సంఘ ఉపాధ్యక్షుడు తోట రాముడు, సభ్యులు తంగెళ్ల సుబ్బారావు, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నేత వితరణ

ముదినేపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): దాకరం గ్రామంలో అనారోగ్య కారణాలతో ఇటీవల మరణించిన చిల్లిముంత శ్రీనివాసరావు కుటుంబానికి ఏపీ పర్యాటక రంగ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ కొడాలి వినోద్ అండగా నిలిచారు. ఆయన తన ఆధ్వర్యంలోని బొర్రా బాలసాయి చారిటబుల్ ట్రస్ట్ తరపున రూ.10 వేల ఆర్థిక సాయాన్ని శుక్రవారం మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. సర్పంచ్ జాస్తి రాజా మృతుడి కుటుంబానికి రూ.2 వేలు సాయం అందజేశారు.

హెల్మెట్ల వినియోగంపై నేడు అవగాహన ర్యాలీ

కైకలూరు జనవరి 24(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ల వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీని శనివారం సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తారు. కైకలూరు సీఎన్నార్ గార్డెన్ నుంచి ట్రావెలర్స్ బంగ్లా వరకు హెల్మెట్లతో బైక్ ర్యాలీ చేపట్టనున్నారు. ర్యాలీ కార్యక్రమానికి ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ కె.ప్రతాప్‌శివకిషోర్, కూటమి నేతలు ప్రజలు పెద్దఎత్తున పాల్గొంటారన్నారు.

నేడు జాబ్‌మేళా

నూజివీడు టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ఎంవీఆర్ వికాస్ జూనియర్ కళాశాలలో శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. 10వ తరగతి నుంచి ఇంటర్, ఐటీఐ, డిగ్రీ వంటి విద్యార్హతలు ఉన్న 18 నుంచి 35 సంవత్స రాల్లోపు యువతీయువకులు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని, ఇతర వివరాలకు 83740 39719 లేదా 96525 03799 నంబర్‌కు సంప్రదించవచ్చని తెలిపారు.

కార్యదర్శికి షోకాజ్ నోటీస్

ముసునూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ముసునూరు మండలం చెక్కపల్లి పంచాయతీ కార్యాదర్శి సుజాతకు శుక్రువారం ఉన్నతాధికారుల నుంచి వచ్చిన షోకాజ్ నోటీసును ఎంపీడీవో అందజేశారు. రెండురోజుల క్రితం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీకి చెక్కపల్లి వచ్చిన మంత్రి పార్థసారథి దృష్టికి స్థానికులు పలు సమస్యలను తీసుకువచ్చారు. అయితే ప్రొటోకాల్ ప్రకారం కార్యదర్శి అందుబాటులో లేకపోవడంతో ప్రొటోకాల్ ఉల్లంఘన క్రింద కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీరాజ్ అధికారికి ఫిర్యాదు చేశారు. దీంతో డీపీవో షోకాజ్ నోటీసు ఇచ్చారు.